వైసీపీ నేతలపై కోడ్ ఉల్లంఘన కేసు నమోదు

ప్రొద్దుటూరు, మార్చి 21: ప్రొద్దుటూరు మండలం కొత్తపల్లె పంచాయతీలోని వివేకానంద కాలనీలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనుమతి లేకుండా బుధవారం వైసీపీ ఎన్నికల ప్రచారం నిర్వహించింది. కార్యక్రమంలో వలంటీర్ సుబ్బారావు, డీలర్ జంగమయ్యపై కోడ్ ఉల్లంఘన కేసు నమోదు చేశారు. ఆ కార్యక్రమంలో ముఖ్య నాయకులుగా పాల్గొన్న మున్సిపల్ వైస్‌చైర్మన్ బంగారురెడ్డి, ఎమ్మెల్యే సోదరుడు రాచమల్లు కిరణ్ రెడ్డిపై కేసు నమోదు చేయలేదు. దీనిపై ఆంధ్రజ్యోతిలో కథనం రావడంతో గురువారం ఎన్నికల అధికారులు స్పందించారు. ఆ మేరకు మున్సిపల్ వైస్ చైర్మన్ బంగారురెడ్డి, రాచమల్లు కిరణ్‌రెడ్డిపై ఎన్నికల కోడ్ ఉల్లంఘన కింద టూటౌన్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘన

● ట్రైసైకిళ్లు పంపిణీ.. ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశం

పులివెందుల రూరల్, మార్చి 21: కుల, మతపరమైన సమావేశాలు నిర్వహించి ఎన్నికల ప్రచారం చేసుకోరాదని మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ) చెబుతున్నా.. వైసీపీ వారు దీనిని యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారు. గురువారం రాత్రి బాకరాపురంలోని ఆడిటోరియంలో వైసీపీ నాయకులు ఆర్యవైశ్య ఆత్మీయ సమావేశం నిర్వహించారు. వైఎస్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో ట్రైసైకిళ్లు పంపిణీ చేసి సిద్ధం పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా పలువురు ఆర్యవైశ్యులు మాట్లాడుతూ చాలా మంది ఉద్యోగాలు లేక ఖాళీగా ఉంటున్నారని, అలాంటి వారందరికి ఉద్యోగాలు ఇప్పించాలని కోరారు. అలాగే అగ్రిగోల్డ్ బాధితులు చాలామంది ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇంతవరకు రూ.10వేలు మాత్రమే వచ్చిందన్నారు. తర్వాత డబ్బులు రాలేదన్నారు. న్యాయం చేయాలని కోరారు. వీటిపై మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ అందరికి తప్పకుండా న్యాయం జరుగుతుందన్నారు. అనంతరం పులివెందుల ఆర్యవైశ్యులు సిద్ధం అనే పోస్టర్లను విడుదల చేశారు. ట్రైసైకిళ్లను పంపిణీ చేశారు. ఇందుకు సంబంధించి పులివెందుల ఆర్డీఓ మరియు ఆర్ఓ వెంకటేశులును వివరణ కోరగా సమావేశానికి అనుమతులు తీసుకున్నారని తెలిపారు.

ట్రిపుల్ ఐటీ డైరెక్టరుపై చర్యలు తీసుకోండి

● జిల్లా ఎన్నికల అధికారికి ఎమ్మెల్సీ ఫిర్యాదు



విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి.. చిత్రంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి తదితరులు

కడప (ఎడ్యుకేషన్), మార్చి 21: ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ డైరెక్టరు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని, దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు గురువారం కలెక్టరు విజయరామరాజుకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఎమ్మెల్సీ విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల కోడ్ వచ్చిన తరువాత ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో ఆటెండరు, సెక్యూరిటీ గార్డులు, హౌస్ కీపింగ్ పోస్టులు భర్తీ చేశారన్నారు. ఎలాంటి నోటిఫికేషన్ రాకుండా రాజకీయ ఒత్తిడికి లోనై డైరెక్టరు వీటిని ఈనెల 17న భర్తీ చేసి కోడ్ వచ్చిన ముందు రోజు అందరికీ అపాయింట్‌మెంటు ఆర్డర్స్ ఇచ్చారని తెలిపారు. దీనిపై డైరెక్టరుకు ఫోను చేసి కోడ్ వచ్చింది కదా పోస్టులు ఎలా భర్తీ చేస్తున్నారని ప్రశ్నించగా.. ఎంపీ అవినాశ్‌రెడ్డి వీటిని భర్తీ చేశారని, వాటిని 15వ తేదీనే భర్తీ చేశామని చెప్పారన్నారు. కోడ్ వచ్చిన తరువాత ఎలా భర్తీ చేస్తారనగా మీ వద్దకు ఎవరైనా లోకల్ వాళ్లు వచ్చి ఉంటే వారి పేర్లు పంపండి, వారికి కూడా ఉద్యోగాలు ఇస్తామని డైరెక్టరు చెప్పారన్నారు. డైరెక్టరు ప్రభుత్వ ఉద్యోగిలా కాకుండా వైసీపీ నాయకుడిగా వ్యవహరిస్తున్నారన్నారు. దీనిపై విచారణ జరిపి అధికార పార్టీ కనుసన్నల్లో జరిగిన నియామకాలను రద్దు చేయాలని కోరారు. అక్రమాలకు పాల్పడిన డైరెక్టరుపై చర్యలు తీసుకోవాలని, ఎన్నికలు ముగిసేంత వరకు ఆయనను ఇక్కడ విధులు నిర్వహించకుండా చేయాలని కోరారు. ఈ వ్యవహారంపై ఎన్నికల కమిషన్‌కు సైతం ఫిర్యాదు చేశామన్నారు.

ట్రిపుల్‌ఐటీలో నియామకాలపై తహసీల్దార్ విచారణ

వేంపల్లె, మార్చి 21: ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో తాత్కాలిక ఉద్యోగుల నియామక వ్యవహారంపై తహశీల్దార్ వెంకటేశ్ నాయక్ విచారణ జరిపారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో తాత్కాలిక ఉద్యోగులను ట్రిపుల్‌ఐటీలో నియమించుకుంటున్నారని టీడీపీ నాయకులు ఫిర్యాదు చేయడంతో విచారణ జరపాలని కలెక్టర్ ఆదేశించారు. దీంతో గురువారం సాయంత్రం తహశీల్దార్ ట్రిపుల్‌ఐటీకి వెళ్లి డైరెక్టర్ కుమారస్వామి గుప్త నుంచి వివరాలు సేకరించారు. నివేదికను కలెక్టర్‌కు పంపనున్నట్లు ఆయన తెలిపారు.

అధైర్యం వద్దు.. అండగా ఉంటాం

● ఓటుతో అరాచక ప్రభుత్వాన్ని సాగనంపాలి
● 'నిజం గెలవాలి'లో నారా భువనేశ్వరి
● గుండెపోటుతో మృతి చెందిన కుటుంబాలకు పరామర్శ
● భువనేశ్వరిని చూసి భావోద్వేగానికి గురైన బాధిత కుటుంబాలు
● ఏ కష్టమొచ్చినా టీడీపీ అండగా ఉంటుందంటూ భరోసా

కడప, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్తలెవ్వరూ అధైర్యపడవద్దని, రెండు నెలలు కష్టపడి ఓటుతో ఈ అరాచక ప్రభుత్వాన్ని సాగనంపాలని టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి పిలుపునిచ్చారు. చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును తట్టుకోలేక రాష్ట్ర వ్యాప్తంగా పలువురు టీడీపీ కార్యకర్తలు గుండెపోటుతో మృతిచెందారు. వీరిని పరామర్శించి ధైర్యం చెప్పేందుకు నారా భువనేశ్వరి 'నిజం గెలవాలి' పేరిట పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా ఆమె గురువారం పోరుమామిళ్లకు వచ్చారు. గుండెపోటుతో మృతిచెందిన కొత్తవీధిలోని మహబూబ్ చాంద్ కుటుంబ సభ్యులను, బలిజకోటలో అక్కమ్మ కుటుంబాన్ని పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలదండ వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా అక్కడకు హాజరైన కార్యకర్తలను ఉద్దేశించి నారా భువనేశ్వరి మాట్లాడుతూ టీడీపీ హయాంలో అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లలో ఉండేదన్నారు. దేశంలోనే రాష్ట్రం నెంబర్‌వన్‌గా ఉండేదని, చంద్రబాబు ఎప్పుడూ రాష్ట్రాభివృద్ధి కోసం ప్రజల కోసం తపించేవారని అన్నారు. ఆయన అరెస్టు సమయంలో హైదరాబాదులో ఐటీ ఉద్యోగులు లక్షలాది మంది సంఘీభావం ప్రకటించి చంద్రబాబుపై ఉన్న మమకారాన్ని చాటుకున్నారన్నారు. చంద్రబాబు అరెస్టు తట్టుకోలేక రాష్ట్ర వ్యాప్తంగా 262 మంది మృత్యువాత పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. 53 రోజులు చంద్రబాబు జైలులో ఉన్నారని, ఆ సమయంలో తనను పిలిచి మృతుల కుటుంబాలను పరామర్శించి భరోసా నింపాలని సూచించారన్నారు. అందుకే నిజం గెలవాలి పేరుతో రాష్ట్రవ్యాప్తంగా ప్రతి టీడీపీ కుటుంబాన్ని పరామర్శిస్తున్నా అన్నారు. తాను ఇంత ధైర్యంగా బయట తిరుగుతున్నానంటే ఇది నా టీడీపీ బిడ్డలు ఇచ్చిన ధైర్యమే అన్నారు.

ఒకప్పుడు చంద్రబాబు అంటే ఏపీ, ఏపీ అంటే దేశంలోనే నెంబవర్‌వన్‌గా ఉండి మంచి గౌరవంగా ఉండేదన్నారు. ఇప్పుడు చులకనయ్యామన్నారు. టీడీపీ పాలనలో భారీ స్థాయిలో ఉద్యోగాలు వచ్చాయి. యువతకు ఉద్యోగ అవకాశాలు వచ్చాయి. వైసీపీ పాలనలో ఒక్క పెట్టుబడి లేదు, కంపెనీ లేదు. జనం ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ఏపీకి రాజధాని లేకుండా చేసి వైసీపీ పరువు తీసిందన్నారు. ఐదేళ్లలో రాష్ట్రంలో జరిగిన దాడులను నేతలు, కార్యకర్తలు సమర్థవంతంగా ఎదుర్కొన్నారన్నారు. పార్టీ కోసం ప్రాణాలర్పించిన కార్యకర్తలకు నా జోహార్లు.. తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే రథసారధులు. నా ధైర్యం కూడా అదే. రక్షణగా ఉన్నారన్న ధైర్యంతోనే నేను అనేక కార్యక్రమాలు చేస్తున్నా.. బయటికి వచ్చి ధైర్యంగా తిరుగుతున్నా అన్నారు. చంద్రబాబునాయుడు సూపర్‌సిక్స్ పథకాలు ప్రవేశపెట్టారని ఆయన సీఎం అయితే వీటిని అమలు చేస్తారని చెప్పారు.

ఓటుతో బుద్ధి చెప్పాలి

రాష్ట్ర భవిష్యత్తుకు వచ్చే ఎన్నికలు చాలా కీలకమైనవని, ఓటు అనే ఆయుధంతో దుర్మార్గుల పాలన అంతం చేద్దామని పిలుపునిచ్చారు. వైసీపీ నాయకులు తమకు ఏం కనిపిస్తే అది ఇష్టానుసారంగా దోచుకుంటున్నారన్నారు. ప్రశ్నిస్తే దాడులు చేస్తున్నారని, భూములు కబ్జా చేస్తున్నారని అన్నారు. కార్యకర్తలు రెండు నెలలు కష్టపడి పనిచేయాలన్నారు. బూత్ స్థాయి నుంచి అప్రమత్తంగా ఉండాలని, వైసీపీ గెలిచేందుకు ఎలాంటి దానికైనా తెగిస్తుందని హెచ్చరించారు. చివరివరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. మీ ఓటుతో పాటు ఒక్కొక్కరు పది ఓట్లు వేసే విధంగా జనాలను చైతన్యవంతం చేయాలని పిలుపునిచ్చారు.



మహబూబ్‌చాంద్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నారా భువనేశ్వరి



మహబూబ్‌చాంద్ కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న భువనేశ్వరి

పరామర్శలో.. భావోద్వేగం

స్కిల్ డెవలప్‌మెంటు కేసులో చంద్రబాబును జగన్ ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేసి 53 రోజుల పాటు జైల్లో పెట్టింది. దీనిని తట్టుకోలేక సెప్టెంబరు 12న పోరుమామిళ్లలోని కొత్తవీధికి చెందిన మహబూబ్ చాంద్ గుండెపోటుతో మృతి చెందారు. భువనేశ్వరి మహబూబ్‌చాంద్ ఇంటికి వెళ్లి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. భువనేశ్వరిని చూసి కుటుంబ సభ్యులు భావోద్వేగానికి గురయ్యారు. మీ అందరికీ టీడీపీ అండగా ఉంటుందని, ఏ కష్టమొచ్చినా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. బలిజకోటకు చెందిన మున్నెల్లి అక్కమ్మ అక్టోబరు 15న గుండెపోటుతో మృతిచెందారు. భువనేశ్వరి ఆమె ఇంటికి వెళ్లి అక్కమ్మ చిత్రపటానికి పూలమాల వేసి కుటుంబసభ్యులను ఓదార్చి భరోసా ఇచ్చారు. అండగా ఉంటామని అభయమిచ్చారు.

భువనేశ్వరి వెంట టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, కడప టీడీపీ అభ్యర్థి మాధవీరెడ్డి, టీడీపీ నాయకులు రితీశ్‌రెడ్డి, బొజ్జ రోశన్న, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ చెరకూరి చెన్నరాయుడు, రంతు, మాజీ జడ్పీటీసీ దాదన భూపాల్‌రెడ్డి, ఇమాంహుసేన్, సుబ్బరావు, నరసింహనాయుడు, కల్వకూరి నడిపి వెంకటసుబ్బయ్య, రామచంద్రారెడ్డి తదితరులు ఉన్నారు.

అపూర్వ స్వాగతం

చంద్రబాబు అరెస్టును తట్టుకోలేక జిల్లాలోని బద్వేలు నియోజకవర్గంలో పలువురు టీడీపీ కార్యకర్తలు మృతి చెందారు. వారిని పరామర్శించేందుకు రెండురోజుల జిల్లా పర్యటనకు భువనేశ్వరి గురువారం మధ్యాహ్నం జిల్లాలోకి ప్రవేశించారు. ఒంటిమిట్ట, భాకరాపేట, సిద్దవటంలో ఆమెకు ఘన స్వాగతలం పలికారు.

ఇక మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, రితీశ్‌రెడ్డి, భూపేశ్‌రెడ్డి ఇతర టీడీపీ నేతలంతా అట్లూరులో స్వాగతం పలికారు. అడుగడుగునా మహిళలు హాజరయ్యారు.

బద్వేలులో బస

పోరుమామిళ్లలో రెండు కుటుంబాలను పరామర్శించిన నారా భువనేశ్వరి గురువారం రాత్రి బద్వేలులోని ఆర్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో బస చేశారు. శుక్రవారం ఉదయం 10.46గంటలకు బి.కోడూరు మండలంలోని గుంతపల్లె చేరుకుంటారు. అక్కడ బాధితులను పరామర్శిస్తారు. 11.45కు కలసపాడు మండలం లింగారెడ్డిపల్లె, 12.30కు బ్రాహ్మణపల్లె, 1.15కు తెల్లపాడు గ్రామాల్లో బాధితులను పరామర్శిస్తారు..



బలిజకోటలో అక్కమ్మ కుటుంబసభ్యులతో భువనేశ్వరి



కొత్తవీధిలో తనను చూసేందుకు వచ్చిన కార్యకర్తలతో మాట్లాడుతున్న నారా భువనేశ్వరి

అనుమతులు లేకుండా స్టిక్కర్లు వేసుకోకూడదు

పులివెందుల టౌన్, మార్చి 21: అనుమతులు లేకుండా రాజకీయపార్టీల స్టిక్కర్లు అతికించుకోరాదని పులివెందుల సీఐలు సురేశ్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, ఎంవీఐ ప్రసాద్, కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆటో డ్రైవర్లకు సమావేశం నిర్వహించి సూచనలు ఇచ్చారు. వారు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినందున ముందస్తు అనుమతులు లేకుండా ఏ రాజకీయపార్టీకి చెందిన జెండాలను, గుర్తులను, పోస్టర్లను లేదా వ్యక్తుల స్టిక్కర్లను వాహనాలకు అతికించరాదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కేసు నమోదు చేస్తామన్నారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి : కమిషనర్

కడప (ఎడ్యుకేషన్), మార్చి 21 : కడప నగరపాలక సంస్థ పరిధిలో నీటిని పొదుపుగా వాడుకోవాలని కమిషనర్ ప్రవీణ్‌చంద్ ప్రజలకు పిలుపునిచ్చారు. నీటి సరఫరాలో నిర్లక్ష్యం చేయవద్దని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించారు. గురువారం కడప నగర పాలక సంస్థ కాన్ఫరెన్స్ హాలులో ఇంజనీరింగ్ విభాగం ఫిట్టర్ హెడ్ వర్కర్స్‌తో సమావేశం నిర్వహించారు. ముందుగా నీటి సరఫరా పట్టికలను జోన్ల వారీగా పరిశీలించారు. అధికారులకు కేటాయించిన ప్రాంతాల్లో నీటి సరఫరాలో ఎక్కడయినా ఇబ్బంది ఉంటే అక్కడ ఆ సమస్య పరిష్కారానికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని డీఈలను ఆదేశించారు. ప్రతిరోజూ ఏ ప్రాంతానికి ఏ సమయానికి నీటి సరఫరా అందిస్తున్నారు అన్న విషయాన్ని ప్రజలకు తెలపాలన్నారు. నీటి సరఫరా సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక కాల్ సెంటరు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎటువంటి ఫిర్యాదులు వచ్చినా ఆరు గంటల్లోగా ఆ సమస్య పరిష్కరించాలన్నారు.

వైసీపీ ప్రచారంలో మెప్మా ఆర్పీ



వైసీపీ ప్రచారంలో పాల్గొన్న మెప్మా ఆర్పీ సుశీల

కడప (ఎడ్యుకేషన్), మార్చి 21: ఎన్నికల కోడ్ అడ్డుగా ఉన్నా కొంతమంది ప్రభుత్వ ఉద్యోగులు, వలంటీర్లు, సిబ్బంది హద్దు మీరుతున్నారు. అధికార పార్టీ ప్రచారంలో అత్యుత్సాహం చూపుతున్నారు. బుధవారం కడప నగరంలో కొందరు డ్వాక్రా ఆర్పీలు, వైసీపీ నేతల వెంట ప్రచారం చేశారు. మెప్మా ఆర్పీ సుశీల ప్రచారంలో చురుగ్గా పాల్గొన్నారు.

వైసీపీ ప్రచారంలో కళాశాల ఉద్యోగి

వేంపల్లె, మార్చి 21: వేంపల్లెలో గురువారం జరిగిన వైసీపీ సిద్ధం ప్రచార కార్యక్రమంలో స్థానిక ఉర్దూ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న పీఈటీ నూర్ అహ్మద్ పాల్గొన్నారని చర్యలు తీసుకోవాలని టీడీపీ డిమాండ్ చేసింది. ఎన్నికల నిబంధనలను తుంగలో తొక్కి ఒక పార్టీకోసం ప్రచారం చేయడం తగదని దీనిపై ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ మునిరెడ్డి తెలిపారు. అనుమతి లేకుండా వైసీపీ నాయకులు ప్రచారాలు చేస్తున్నారని, వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు.



వేంపల్లెలో వైసీపీ నాయకులతో కలిసి ప్రచారంలో పాల్గొన్న ఉర్దూ జూనియర్ కళాశాల తాత్కాలిక ఉద్యోగి నూర్ అహ్మద్

గొంతు తడిసే దారేది?

రాష్ట్ర ప్రజలపైనే కాదు.. సొంత జిల్లా ప్రజలపైనా సీఎం వైఎస్ జగన్‌కు ఏమాత్రం బాధ్యత లేదని పలువురు ఆరోపిస్తున్నారు. వర్షాభావం వెంటాడుతోంది. పెన్నా కుందూ ఎండిపోయాయి. జలాశయాల్లో నీళ్లు అడుగంటాయి. చాలా గ్రామాల్లో వారానికి ఒకసారి నీటిని సరఫరా చేస్తున్నారు. జిల్లా కేంద్రమైన కడప నగరంలో తాగునీటిని నాలుగురోజులకు ఒకసారి వదులుతున్నారు. ఈ ఇబ్బందిని ముందే అంచనా వేసిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు జనవరి 24 నుంచి జులై 24 వరకు ఐదు నెలలకు సంబంధించి రూ.1577.23లక్షలతో డ్రాట్ యాక్షన్ ప్లాన్ తయారు చేసి ప్రభుత్వానికి పంపారు. రెండునెలలైనా ఇప్పటి వరకూ ఒక్కరూపాయి కూడా ప్రభుత్వం విడుదల చేయలేదు. దీంతో తాగునీటిని సరఫరా చేయలేక అధికారులు నానా తంటాలు పడుతున్నారు. గొంతు తడిసే మార్గం లేక జిల్లా ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

● తాగునీటి ఎద్దడికి నిధుల కొరత
● రూ.1577.23 లక్షలతో డ్రౌట్ యాక్షన్ ప్లాన్
● అయినా ఒక్క రూపాయి కేటాయించని ప్రభుత్వం
● అయోమయంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు
● గ్రామ పంచాయతీ నిధులతో నెట్టుకొస్తున్న వైనం
● ఎండిన పెన్నా.. అడుగంటిన రిజర్వాయర్లు
● ముంచుకొస్తున్న తాగునీటి ముప్పు



అడుగంటిన మైలవరం జలాశయం

కడప(రూరల్), మార్చి 21: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సొంత జిల్లాలో నీటి ఎద్దడికి నిధుల కొరత వెంటాడుతోంది. ఈ ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. దీనికి తోడు సూర్యుడు రోజురోజుకు మండిపోతున్నాడు. దీంతో నీటిఎద్దడి తరుముకొస్తోంది. ఈ ప్రమాదం నుంచి ప్రజలను గట్టెక్కించేందుకు నిధులు లేక ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ అధికారులు అల్లాడుతున్నారు. ఇప్పటికే జిల్లాలో తాగునీటి సమస్య మొదలైంది. నీటి సమస్య పరిష్కారానికి నిధులు లేకపోవడంతో గ్రామ పంచాయతీ నిధుల నుంచి ట్రాన్స్‌పోర్టేషన్ జరుపుతూ నెట్టుకొస్తున్నారు. అయితే ఏప్రిల్ నెలలో నీటి సమస్య మరింత జఠిలం కానుండడంతో నిధులను ఎలా సమకూర్చాలని అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా నీటివనరుల స్థితిగతులను, నీటి లభ్యతను పరిగణనలోకి తీసుకొని నీటి ఎద్దడిని అధికారులు అంచనావేసి జనవరి 24 నుంచి జూన్ 24 వరకు రూ.1577.23 లక్షలు అవసరం అంటూ డ్రాట్ యాక్షన్ ప్లాన్ తయారుచేసి ప్రభుత్వానికి పంపారు. 1,194 గ్రామాలలో ప్రజలు నీటిఎద్దడి బారిన పడనున్నారని గుర్తించారు. ఇందుకు 2,08,856 ట్యాంకర్ల నీటి సరఫరాకు ఒక్కొక్క ట్యాంకర్‌కు రూ.519.75 చొప్పున మొత్తం రూ.1,085.61 లక్షలు అవసరంగా పేర్కొన్నారు. 689 గ్రామాల్లో పశువులు నీటిఎద్దడి బారిన పడనున్నాయని ఈ మేరకు వాటికి నీటిని సరఫరా చేసేందుకు 45,085 ట్యాంకర్లకు గాను రూ.232.46 లక్షలు అవసరంగా పేర్కొన్నారు. మరో 44 గ్రామాల్లో 44 వ్యవసాయ బోరుబావులను అద్దెకు తీసుకోవాల్సి ఉందని ఇందకు రూ.0.12 లక్షలు అవసరమని తెలిపారు. అలాగే 45 బోరుబావుల ఫ్లసింగ్‌కు రూ.13.50 లక్షలు, 300 బోరుబావుల డీపింగ్‌కు రూ.245.54 లక్షలు అవసరమని ప్రతిపాదనల్లో పేర్కొన్నారు.

ఇందులో జనవరి 24 నుంచి ఫిబ్రవరి 24 వరకు 27 మండలాల్లోని 140 గ్రామాలకు గాను రూ.186.02 లక్షలు, ఫిబ్రవరి 24 నుంచి మార్చి 24 వరకు 28 మండలాల్లో 169 గ్రామాలకు గాను రూ.214.89 లక్షలు, మార్చి 24 నుంచి ఏప్రిల్ 24 వరకు 29 మండలాల్లో 216 గ్రామాలకు గాను రూ.276.45 లక్షలు అవసరం అని పేర్కొన్నారు. అలాగే ఏప్రిల్ 24 నుంచి మే 24 వరకు 30 మండలాల్లో 240 గ్రామాలకు రూ.310.37 లక్షలు, మే 24 నుంచి జూన్ 24 వరకు 30 మండలాల్లో 259 గ్రామాలకు గాను రూ.294.68 లక్షలు, జూన్ 24 నుంచి జూలై 24 వరకు 30 మండలాల్లో 258 గ్రామాలకు గాను రూ.294.82 లక్షలు అవసరంగా పేర్కొన్నారు. ఈ మేరకు నీటి ఎద్దడి గ్రామాల ప్రజలకు, అక్కడి పశువులకు తాగునీటి సరఫరాకు మొత్తం రూ.1577.23 లక్షలు అసరంగా ప్రతిపాదనలు తయారు చేసి ఈఎంసీకి పంపారు. అయినా ఇంతవరకు ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి నిధులు కేటాయించలేదు. ఇప్పటికే రెండు నెలలు గడిచిపోయాయి. రానున్న మాసాల్లో తాగునీటి ఎద్దడి తీవ్రరూపం దాల్చనుంది. ఈ రెండు నెలలు పంచాయతీల నిధులతో ఎలానో నెట్టుకొచ్చారు. ఇక మీదట అలా సాధ్యం కాదని అధికారులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోతే జిల్లా ప్రజల గొంతు తడిసేది కష్టమే అని పలువురు పేర్కొంటున్నారు

అడుగంటిన రిజర్వాయర్లు..

గత ఏడాది తీవ్ర వర్షాభావం వెంటాడింది. చాలా వరకు పంటపొలాలు సాగుకు నోచుకోలేదు. అరకొర సాగైన పంటలూ చేతికి సరిగా అందలేదు. ఇక ప్రధానమైన పెన్నానది ప్రస్తుతం పూర్తిగా ఎండిపోయింది. దీనిచుట్టూ ఉన్న బోరుబావులూ అడుగంటాయి. జిల్లా ప్రజలకు తాగునీరు అందించే మైలవరం జలాశయంలో కేవలం 0.3 టీఎంసీల నీళ్లు మాత్రమే ఉన్నాయి. ఇక్కడి నుంచి జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, ఎర్రగుంట్ల ఆర్టీపీపీ, కడప నగరానికి తాగునీటిని ఫిల్టర్ పాయింట్లద్వారా సరఫరా చేస్తారు. ప్రస్తుతం జలాశయంలో ఫిల్టర్ పాయింట్ల అడుగు వద్దకు నీళ్లు ఇంకిపోయాయి. దీంతో ఇక రెండుమూడు రోజుల్లో మైలవరం జలాశయం నుంచి నీళ్లు వచ్చేది ప్రశ్నార్థకమే. వేసవిలో నీటి ఎద్దడికి ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా నిధులు విడుదల చేయకపోవడం, జలాశయాలు అడుగంటడంతో ఈ వేసవిలో ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పేలా లేవు.

వైసీపీ నేతల భయం

తాగు నీటి సమస్య ప్రారంభం కావడంతో నీటి ఎద్దడి గ్రామాల ప్రజలు వైసీపీ ప్రజాప్రతినిధులను నిలదీస్తున్నారు. సాధారణ ఎన్నికల ప్రక్రియ మొదలు కావడంతో జిల్లాలో అధికార పార్టీ ఎమ్మెల్యేలే మళ్లీ ఎమ్మెల్యే అభ్యర్థులుగా బరిలోకి దిగి ప్రచారం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నీటి ఎద్దడి గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే అభ్యర్థులను నిలదీస్తున్నారు. కనీసం తాగునీటిని అందించలేకున్నారని ఏముఖం పెట్టుకొని మళ్లీ ఓట్లు అడుగుతున్నారని మోహమాటం లేకుండా ప్రశ్నిస్తున్నారు. దీంతో అధికార పార్టీ అభ్యర్థుల్లో నీటి సమస్య గుబులు రేపుతోంది.

పంచాయతీ నిధులతో..

వేసవి కాలం ప్రారంభమైన నేపథ్యంలో గ్రామ పంచాయతీ నిధులతో నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపడుతున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ వీరన్న పేర్కొన్నారు. ఈ ఏడాది జనవరి 24 నుంచి జూన్ 24 వరకు రూ.1577.23 లక్షలతో డ్రాట్ యాక్షన్ ప్లాన్ తయారుచేసి ప్రభుత్వానికి పంపామని, ఇప్పటి వరకు నిధులు రాలేదన్నారు.



వీరన్న, ఎస్ఈ, ఆర్‌డబ్ల్యూఎస్

భర్త వేధింపులు తాళలేక భార్య ఆత్మహత్య


లక్ష్మీదేవి మృతదేహం

లక్కిరెడ్డిపల్లె, మార్చి 21: మండలంలోని కస్తూరిరాజుగారిపల్లెకు చెందిన లక్ష్మీదేవి (28) అనే వివాహిత భర్త వేధింపులు తాళలేక గురువారం తెల్లవారుజామున బావిలో పడి మృతి చెందినట్లు ఎస్ఐ విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన వివరాల మేరకు... రామాపురం మండలం గువ్వలచెరువు మూలపల్లెకు చెందిన ఒంటేరు లక్ష్మీదేవికి లక్కిరెడ్డిపల్లె మండలం కస్తూరిరాజుగారిపల్లెకు చెందిన ప్రసాద్‌కు 8 సంవత్సరాల కిందట వివాహమైంది. వీరికి ముగ్గురు ఆడపిల్లలు సంతానం. కొన్నాళ్లపాటు వీరి జీవనం అన్యోన్యంగా సాగినా ఆ తర్వాత నిత్యం గొడవలు పడేవారని, దీంతో మృతురాలు రెండు సార్లు ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిసిందన్నారు. కాగా బుధవారం రాత్రి కూడా ఇరువురు గొడవలు పడ్డారని, దీంతో బిడ్డలను వదిలేసి వెళ్లి తిరిగి రాకపోవడంతో ఉదయాన్నే చుట్టుపక్కల వెతికారు. అనంతరం గ్రామానికి సమీపంలోని పాతబావిలో శవమై కనిపించడంతో మృతురాలు బంధువులు బయటకు తీసుకొచ్చి ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలి తల్లి, బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలపారు.

వివాహం చేయలేదని యువకుడు...


మహేశ్ (ఫైల్)

లక్కిరెడ్డిపల్లె, మార్చి 21: మండలంలోని బి.యర్రగుడి పంచాయతీలోని కాపుపల్లెకు చెందిన దేరంగుల మహేశ్ (22) అనే యువకుడు వివాహం చేయలేదని మనస్థాపానికి గురై గురువారం తెల్లవారుజామున ఇంటిలో పైకప్పుకు ఉన్న కడ్డీకి చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన వివరాల మేరకు.. బి.యర్రగుడి కాపుపల్లెకు చెందిన మహేశ్ డిగ్రీ చదువు పూర్తి చేసుకుని ఎన్‌సీసీలో పట్టా పొంది ఆర్మీకి వెళ్లేందుకు సిద్ధమయ్యాడు. ఈ క్రమంలో తనకు వివాహం చేయాలని కుటుంబ సభ్యులను అడుగగా, నీకంటే పెద్దవాడు మీ అన్నకు వివాహం చేయకుండా నీకెలా చేస్తామని వారించారు. దీంతో మహేశ్ మనస్థాపానికి గురై తన ఇంటిలోని పైకప్పుకు ఉన్న కడ్డీకి చీరతో ఉరివేసుకొన్నాడు. ఉదయాన్నే తన అన్న రమేశ్ లేచి చూడగా చీరకు వేలాడుతున్న తన తమ్ముడిని గుర్తించి హుటాహుటిన స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అతను మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారని బంధువులు తెలిపారు. ఈ మేరకు మృతుడి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు


వివరాలు తెలియజేస్తున్న సీఐ శంకర్‌రెడ్డి

పులివెందుల టౌన్, మార్చి 21: రెంటాల బాబు (15) అనే బాలుడిని ఈనెల 18వ తేదీ హత్య చేసి ఘటనలో నిందితుడిని అరెస్టు చేసినట్లు సీఐ శంకర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన ఆ వివరాలు వెల్లడించారు. హత్యకు గురైన బాబు, అతడి తల్లి అనురాదాదేవి, నిందితుడు రెంటాల సురేశ్ నగరిగుట్టలోని పక్క పక్క ఇళ్లలో నివాసం ఉండేవారు. రెంటాల సురేశ్ మతిస్థిమితం సరిగా లేనట్లు నటిస్తూ దారిన పోయే వారితో గట్టిగట్టిగా అరుస్తూ ఉండేవాడు. నిందితుడికి వివాహం కానందున బాబు, అతడి తల్లి అప్పుడప్పుడు అతడికి కూరలు ఇచ్చేవారు. ఈ క్రమంలో 18వ తేదీ ఇంట్లో ఎవరూ లేని సమయంలో వెళ్లి బాబును అక్కడే ఉన్న బ్యాట్‌తో తలపై, ముఖంపై బలంగా కొట్టగా మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగా గురువారం సాయంత్రం పులివెందలలో అరెస్టు చేసినట్లు సీఐ వివరించారు.

మూడు మోటారు సైకిళ్లు దహనం


కాలిపోయిన మోటారు సైకిళ్లు, వివరాలు వెల్లడిస్తున్న సీఐ భాస్కర్‌రెడ్డి

కడప (క్రైం), మార్చి 21 : కడప నగరంలోని వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో నాగరాజుపేట, శ్రీహరిరావు వీధిలో గురువారం తెల్లవారుజామున నారసనేని చంద్రశేఖర్ ఇంటి ముందు పార్కు చేసి ఉంచిన హోండా డియో మోటారు సైకిలు, టీవీఎస్ ఎక్సెల్‌లను బేగ్ మహబూబ్‌బాషా అనే వ్యక్తి నిప్పంటించి కాల్చివేశాడు. అలాగే మరికొంత దూరంలో నాగరాజుపేటకు చెందిన న్యాయవాది షేక్ నజీర్‌బాషా హోండా యాక్టివా మోటారు సైకిలుకు నిప్పు పెట్టడంతో పాక్షికంగా కాలిపోయాయి. ఈ రెండు సంఘటనల గురించి ఇరువురు బాధితులు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే రంగంలోకి దిగిన కడప వన్‌టౌన్ సీఐ భాస్కర్‌రెడ్డి, ఎస్ఐలు మధుసూదన్‌రెడ్డి, రంగస్వామితో కలిసి విచారణ చేపట్టారు. సీపీవో షేక్ ఆబిద్ సహకారంతో వాహనాలను నిప్పుపెట్టిన నిందితుడిని స్థానికంగా ఉన్న సీసీ టీవీల ఫుటేజీ ద్వారా కనుగొన్నారు.

గంటల వ్యవధిలోనే నిందితుడి అరెస్టు : వాహనాలకు నిప్పు పెట్టిన నిందితుడిని పోలీసులు కొన్ని గంటల వ్యవధిలోనే గుర్తించారు. కడప పాత బస్టాండులో అనుమానాస్పదంగా తిరుగుతున్న రవీంద్రనగర్‌కు చెందిన బేగ్ మహబూబ్‌బాషాగా గుర్తించారు. గురువారం కడప వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీఐ భాస్కర్‌రెడ్డి నిందితుడి వివరాలను తెలిపారు. నిందితుడు కడప నగరంలో హోటళ్లలో పని చేస్తూ మద్యానికి బానిసయ్యాడన్నారు. అలాగే పంచర్లు వేసే సొల్యూషన్‌ను పీల్చేవాడన్నారు. ఇతను గతంలో కూడా కడప తాలుకా పోలీసుస్టేషన్ పరిధిలో నిద్రపోతున్న బాలుడి తలను పగలగొట్టిన కేసులో ఆరు సంవత్సరాల పాటు జైలు శిక్ష అనుభవించాడన్నారు.

నేటి నుంచి ఇంటర్మీడియట్ మూల్యాంకనం

హాజరు కాని అధ్యాపకులకు జరిమానా : ఆర్ఐవో



కడప (ఎడ్యుకేషన్), మార్చి 21: ఇంటర్మీడియట్ మూల్యాంకనం శుక్రవారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఆర్ఐవో బండి వెంకటసుబ్బయ్య తెలిపా రు. జ్ఞానభూమి లాగిన్‌లో అధ్యాపకుల అపాయింట్‌మెంటు ఆర్డర్లు ఉన్నాయన్నారు. మూల్యాంకనానికి హాజరు కాని అధ్యాపకులకు జరిమానాతో పాటు కఠినచర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ఉదయం 10 గంటల నుంచి మూల్యాంకనానికి హాజరు కావాలన్నారు. స్పాట్ వాల్యుయేషన్ అపాయింటుమెంటు ఆర్డర్స్ పొందిన అధ్యాపకులు మూల్యాంకనానికి హాజరయ్యేలా కళాశాల ప్రిన్సిపాల్స్, యాజమాన్యం బాధ్యత తీసుకోవాలని సూచించారు. హాజరు కాని అధ్యాపకునికి రోజుకు రూ.వెయ్యి చొప్పున జరిమానా విధిస్తామని స్పష్టం చేశారు.

నేడు డయల్ యువర్ ఆర్ఎం

రాయచోటిటౌన్, మార్చి 21: ఏపీఎస్ఆర్టీసీ సమస్యలపై శుక్రవారం సాయంత్రం 4 గంటలకు డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమం ఉంటుందని ఆర్టీసీ అధికారులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా ఆర్టీసీ సేవలు పొందుతున్న ప్రయాణికులతో పాటు ఇతర ప్రజలు తమ సమస్యలు సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు 8985283211 అనే నెంబరుకు ఫోన్ చేసి సమస్యలు తెలిచేయాలన్నారు.

32 మద్యం బాటిళ్లు స్వాధీనం

కొండాపురం, మార్చి 21: మండలంలోని లావనూరు, తాళ్లప్రొద్దుటూరు గ్రామాలలో 32 మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. లావనూరు గ్రామానికి చెందిన క్రిష్ణమూర్తి అనే వ్యక్తి 14 బీరు బాటిళ్లు, 3 మద్యం బాటిళ్లు విక్రయిస్తుండగా వాటిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు కొండాపురం ఎస్ఐ యోగీంద్ర తెలిపారు. తాళ్లప్రొద్దుటూరు గ్రామానికి చెందిన సూర్యనారాయణ అనే వ్యక్తి 15 మద్యం బాటిళ్లను అనుమతి లేకుండా విక్రయిస్తుండగా వాటిని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు.

అభివృద్ధి పేరుతో 'నిధులు ‘లిఫ్ట్’

- అంచనా రూ.5.95 లక్షలు ● వ్యయం రూ.15.80 లక్షలు
- టెండరు లేకుండానే పనులు ● డీసీఎంఎస్‌లో అవకతవకలు


డీసీఎంఎస్ భవనం

కడప (ఎన్టీఆర్ సర్కిల్), మార్చి 21: అభివృద్ధి మాట దేవుడెరుగు.. అవకాశం చిక్కితే పంచుకుతినడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. అభివృద్ధి మాటున నిధులను స్వాహా చేస్తున్న సంఘటన జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్)లో చోటు చేసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పురాతన గోదాములను కూలగొట్టి వ్యాపార సముదాయం కలిగిన కాంప్లెక్స్‌ను గత పాలకులు నిర్మించారు. దీంతో డీసీఎంఎస్‌కు ఒక మంచి ఆస్తి ఒనగూరినట్లయింది. అయితే అప్పట్లోనే బహుళ అంతస్తులు గల ఈ భవనానికి లిఫ్టు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేశారు. ఏ కారణం చేతనో ఆ ఒక్క పని ఆగిపోయింది. నాలుగు అంతస్తులు గల ఈ భవనానికి కొన్ని అంతస్తుల గల భవనాలు ఖాళీగా ఉన్నా యి. వాటిల్లో చేరేందుకు లిఫ్టు లేకపోవడం వల్ల ఎవరు ముందుకు రావడం లేదని, లిఫ్టు ఏర్పాటు చేస్తే గదులు ఖాళీగా లేకుండా అద్దె వసూలయ్యే అవకాశం ఉంటుందని పీఐసీ కమిటీలోని కొంత మంది పెద్దలు, అధికారులు ఆలోచనకు వచ్చారు. అదే తడవుగా లిఫ్టు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేశారు. అయితే కేవలం రూ.6లక్షల లోపు ఖర్చయ్యే ఈ పనిని రూ.15.80 లక్షల మేరకు ఖర్చు చేశారని, ఇందులో భారీ స్థాయిలో అవకతవకలు జరిగినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

వర్కింగ్ ఎస్టిమేషన్ నుంచే అక్రమాలు...

ప్రధానంగా లిఫ్టు ఏర్పాటు విషయంలో మొదట చేయాల్సిన వర్కింగ్ ఎస్టిమేషన్ పనిని చేపట్టలేదని.. అక్కడ నుంచే అక్రమాలకు పునాది పడిందని కొంత మంది చర్చించుకుంటున్నారు. నిబంధనల మేరకు వర్క్ ఎస్టిమేషన్ వేసిన తరువాత బోర్డు సమావేశంలో పెట్టి, బోర్డు ఆమోదించిన తరువాత టెండర్లకు పిలవాల్సి ఉంటుందని కొంతమంది అభిప్రాయపడుతున్నారు. అలా వచ్చిన టెండర్లలో లెస్‌కు వేసిన వారిని ఎంపిక చేసి వారికి సంబంధించిన ఫర్మ్ సక్రమంగా ఉందా, లేదా అన్నది చూసిన తరువాత పనులు అప్పగించాలని నిబంధనలు చెబుతున్నాయి. దీంతో పాటు మెజర్‌మెంటు బుక్‌లో అన్నీ పొందుపరచాలని, వీటన్నిటి కంటే ప్రథమంగా టెక్నికల్ ఆర్డరు ఉండాల్సిన అవసరం ఉంది. అందుకోసం సాంకేతిక నిపుణుల అవసరం ఉన్నప్పటికీ వీటిల్లో ఏ ఒక్కటీ ఆలస్యం చేయకుండా ఒక ప్రైవేటు కాంట్రాక్టరుకు పనులు అప్పగించి భారీ స్థాయిలో నిధులు అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పనులు జరుగుతున్న సమయంలో మానిటరింగ్ ఆఫీసర్లను నియమించాలని.. అలా చేయకుండా గుత్తమొత్తంగా పనిని కాంట్రాక్టరుకు అప్పగించడం నిబంధనలకు విరుద్ధమనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రూ.5.95 లక్షలు పనికి...

ప్రస్తుతం డీసీఎంఎస్‌లో ఏర్పాటు చేసిన లిఫ్ట్ అంచనా మొత్తం రూ.5.95 లక్షలతో పూర్తవుతుందని హైటెక్ లిఫ్ట్ అండ్ ఎస్కవేటరు సంస్థ ఎస్టీమేషన్ ఇచ్చినట్లు తెలుస్తోంది. జీ ప్లస్2 గ్రౌండ్‌తో పాటు రెండంతస్తుల భవనానికి ఆరుగురిని తీసుకెళ్లే కెపాసిటీ గల లిఫ్టును ఏర్పాటు చేసేందుకు గేటుతో ఏర్పాటు చేస్తే 5.95 లక్షలు, గ్లాస్ డోర్ ఆటోమేటిక్ అయితే రూ.7.45 లక్షలతో ఏర్పాటు చేయవచ్చని ఎస్టిమేషన్ ఇచ్చిన పరిస్థితి. కానీ ఈ ఎస్టిమేషన్‌లో పేర్కొన్న లిఫ్టు మహా అయితే రూ.6లక్షలు ఖర్చయ్యే పరిస్థితి ఉంది. మరి ఏ విధంగా రూ.15.80 లక్షలు ఖర్చు చేశారో అంతు చిక్కని విషయంగా ఉందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇదే అంశంపై ఇప్పటికే సహకారశాఖ ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదులు వెళ్లాయి. దీనిపై సమగ్రంగా విచారణ జరిపితే వాస్తవాలు బయటపడే అవకాశాలు లేకపోలేదు. వాస్తవంగా గణాంకాలు పరిశీలిస్తే దాదాపు రూ.10లక్షల మేర పక్కదారి పట్టినట్లు తెలుస్తుంది.

ప్రైవేటు వ్యక్తికి అప్పగించడంలో...

కడప నగరంలో లిఫ్టుకు సంబంధించిన ఒక ప్రముఖ కంపెనీ ఉన్నప్పటికీ ప్రైవేటు వ్యక్తికి దాని నిర్మాణ బాధ్యతలు అప్పగించడం, పనులు మొదలు పెట్టినప్పటి నుంచీ డబ్బులు ఇవ్వడం వెనుక ఆంతర్యమేమిటోననే అంతు చిక్కడం లేదు. ఇదిలా ఉంటే పనులు పూర్తి చేసిన కాంట్రాక్టరు జీఎస్టీ ఇన్‌వాయిస్ ఇస్తే రూ2.5 లక్షల వరకు తిరిగి డీసీఎంఎస్‌కు జీఎస్టీ వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఆ ఇన్‌వాయిస్ కూడా ఇవ్వకపోవడంతో దాన్ని కూడా కోల్పోవాల్సిన పరిస్థితి. దీనిపై సహకార శాఖ ఉన్నత స్థాయి అధికార యంత్రాంగం దృష్టి సారించి సమగ్రంగా విచారణ జరపాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ విషయంపై స్థానిక డీసీఎంఎస్ మేనేజరు ఖాదర్‌వల్లిని వివరణ కోరగా, ఆన్‌లైన్ ద్వారా కొటేషన్లు స్వీకరించామని, వాటిల్లో మూడు కొటేషన్లు వచ్చాయని, అందులో లెస్‌కు వేసిన వారికే పనులు అప్పగించామన్నారు.


డీసీఎంఎస్ భవనం లిఫ్టు

శిక్షణను సద్వినియోగం చేసుకోండి

- డీఎంహెచ్‌వో డాక్టర్ కొండయ్య



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ కొండయ్య

రాయచోటిటౌన్, మార్చి 21: మూడు రోజుల పాటు నిర్వహించే కేర్ క్యాంపెనియన్ (సంరక్షణ సహచర కార్యక్రమం) శిక్షణను సీహెచ్‌వోలు, ఎంఎల్‌హెచ్‌పీలు సద్వినియోగం చేసుకోవాలని అన్నమయ్య జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండయ్య తెలిపారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలోని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రదాల్లో పనిచేస్తున్న సీహెచ్‌వో, ఎంఎల్‌హెచ్‌పీలకు జరగనున్న మూడు రోజుల శిక్షణా కార్యక్రమంలో భాగంగా గురువారం రాయచోటిలోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో డీఎంహెచ్‌వో డాక్టర్ కొండయ్య, డీపీఎంవో డాక్టర్ రియాజ్‌బేగ్, డీఎస్ఎంవో డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డిలు శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో పనిచేస్తున్న సీహెచ్‌వో/ఎంఎల్‌హెచ్‌పీ (సమాజ ఆరోగ్య అధికారులు)లకు జిల్లాలోని మూడు డివిజన్‌లలో మూడు బ్యాచ్‌ల చొప్పున మొత్తం 9 బ్యాచ్‌లతో కలిపి 375 మంది సీహెచ్‌వోలకు శిక్షణ ఇస్తారన్నారు. డీపీఎంవో డాక్టర్ రియాజ్‌బేగ్ మాట్లాడుతూ ఒక్కో డివిజన్‌లో ఒక్కొక్క శిక్షణ పొందిన టీవోటీల చేత రాయచోటి, రాజంపేట, మదనపల్లె డివిజన్‌లలో మూడు రోజుల పాటు ఈ శిక్షణ ఈనెల 21వ నుంచి ఏప్రిల్ నెల 4వ తేదీ వరకు మూడు విడతలుగా జరుగుతాయన్నారు. శిక్షణ కార్యక్రమం జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ సంధ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో టీవోటీ డాక్టర్ జవహర్‌బాబు, రాయచోటి డివిజన్‌లోని వివిధ పీహెచ్‌సీలలో పనిచేస్తున్న సీహెచ్‌వోలు హాజరయ్యారు.

ఎన్నికల కమిషన్ ఆదేశాలను పాటించాలి


సమావేశంలో మాట్లాడుతున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

పీలేరు, మార్చి 21: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఎన్నికల సంఘం ఎప్పటికప్పుడు జారీ చేసే ఆదేశాలు, నియమాలు, నిబంధనలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని పీలేరు నియోజకవర్గ ఎన్నికల అధికారి, జేసీ ఫర్మాన్ అహ్మద్ తెలిపారు. పీలేరులోని తహసీల్దారు కార్యాలయంలో గురువారం ఆయన నియోజకవర్గంలోని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమకు అన్ని పార్టీలు ఒక్కటేనని, ఎన్నికలకు సంబంధించిన ఏ పని చేయాలన్నా రాజకీయ పార్టీలు ముందుగా అనుమతి తీసుకోవాలన్నారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన కోడ్ ఆఫ్ కాండక్టును అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల ప్రచారాలు, కార్యాలయాల ఏర్పాటు, వాహనాల ద్వారా ప్రచారం వంటి వాటి కోసం 'సువిధ' యాప్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రస్తుతం ఆ యాప్ అందుబాటులో ఉందని, దరఖాస్తు చేసుకున్న 48 గంటల్లో అనుమతులు లభిస్తాయన్నారు. కోడ్ ఆఫ్ కాండక్టు ఉల్లంఘించే వారిపై 'సి-విజిల్' యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చునని వివరించారు. అనంతరం ఆయన రాజకీయ పార్టీల ప్రతినిధులకు 'సి-విజిల్' యాప్ పనితీరును వివరించారు. ఈ సమావేశంలో ఈఆర్‌వో రమ, పీలేరు, వాల్మీకిపురం, కలకడ, కేవీపల్లె, గుర్రంకొండ, కలికిరి తహసీల్దారు మహబూబ్ బాషా, ఖతీజున్ ఖుబ్రా, విజయకుమారి, శ్రీనాథ్, ప్రియదర్శిని, నయాజ్ అహ్మద్, టీడీపీ, వైసీపీ, సీపీఎం ప్రతినిధులు పాల్గొన్నారు.

రాచమల్లుపై బెదిరింపుల కేసు నమోదు

ప్రొద్దుటూరు, మార్చి 21: వైసీపీ మహిళా కౌన్సిలర్ జంబాపురం వెంకటలక్ష్మి ఆమె భర్త రామాంజనేయులరెడ్డిలను ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి బెదిరింపులకు పాల్పడిన ఘటనపై త్రీటౌన్‌పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాలిలా.. ఫిబ్రవరి 19న తన భర్త ఇంట్లో లేని సమయంలో ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి అక్రమంగా ఇంట్లోకి ప్రవేశించి తన భర్తను అసభ్యపదజాలంతో దూషించి, పార్టీ ప్రచారంలో పాల్గొనకపోతే మీ అంతు చూస్తానని బెదిరింపులకు పాల్పడ్డారని జంబాపురం వెంకటలక్ష్మి ఎస్పీకి మొదట ఫిర్యాదు చేశారు. అనంతరం జాతీయ ఎన్నికల కమిషన్‌కు సైతం ఫిర్యాదు చేశారు. ఆ మేరకు ప్రొద్దుటూరు డీఎస్పీ మురళీధర్, త్రీటౌన్ సీఐ వెంకటరమణ విచారించారు. అంతేకాకుండా ఆమె ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడంతో ప్రొద్దుటూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి కౌసర్‌బాను ఎమ్మెల్యే బెదిరింపు ఘటనపై విచారించి చర్యలు తీసుకోవాలని ఎస్పీని కోరారు. దీంతో డీఎస్పీ మళ్లీ విచారించారు. ఈ పరిణామాల నేపథ్యంలో మార్చి 18న ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డిపై ఐపీసీ 448, 506 రెడ్‌విత్ 34 సెక్షన్ల కింద నమోదు చేశారు. కేసు నమోదు తరువాత ఎమ్మెల్యే రాచమల్లు నుంచి తమకు రక్షణ కల్పించాలని కౌన్సిలర్ వెంకటలక్ష్మి, రామాంజనేయరెడ్డి వారి కుటుంబసభ్యులు కోరడంతో వారికి బుధవారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి కౌసర్‌బాను సమక్షంలో డీఎస్పీ మురళీధర్ భరోసా కల్పించారు. ఎటువంటి బెరింపులకు పాల్పడినా, ఏదైనా హాని జరిగిన తమకు ఫోన్ చేయాలని తెలిపారు.

హుండీని పగులకొట్టిన దొంగలు



ఖాజీపేట, మార్చి 21: కడప-కర్నూలు జాతీయ రహదారిలోని భూమాయపల్లె వద్ద గల భీమలింగేశ్వర ఆలయంలో బుధవారం అర్ధరాత్రి హుండీని దొంగలు పగులకొట్టారు. ఆ హుండీలో ఏమీ లేకపోవడంతో ఆలయ కమిటీ ఊపిరి పీల్చుకుంది. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. సీఐ రామాంజులు మాట్లాడుతూ ఆలయంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, వాచ్‌మెన్‌ను కూడా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

కడప (ఎడ్యుకేషన్), మార్చి 21 : వైవీయూ ఏప్రిల్‌లో జరపతలపెట్టిన స్నాతకోత్సవంలో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ పట్టాలు పొందడానికి దరఖాస్తు స్వీకరణ గడువు ఈనెల 21 నుంచి 30వ తేది వరకు పొడిగించినట్లు వీసీ చింతా సుధాకర్ తెలిపారు. విద్యార్థుల అభ్యర్థన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇప్పటిదాకా వివిధ డిగ్రీల పట్టాల కోసం 8898 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. విద్యార్థులు సకాలంలో దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు.

పోలీసు అధికారులు, సిబ్బందికి ఉగాది పురస్కారాలు

కడప(క్రైం), మార్చి 21: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లాలో పనిచేస్తున్న పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది ఉత్తమ సేవా పతకాలకు ఎంపికయ్యారు. ఉగాది పర్వదినాన వీరు పురస్కారాలు అందుకోనున్నారు.

కడప ఏఆర్ ఏఎస్పీ కృష్ణారావు, 11వ బెటాలియన్ కమాండెంట్ శ్రీనివాసరావుకు ఉత్తమ సేవా పతకం లభించింది. అలాగే సేవా పతకాల కింద కడప ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న ఏఎస్ఐ అరుణాచలం, సిద్దవటం హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఆనంద్, ప్రొద్దుటూరు ట్రాఫిక్ హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు, కడప ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వర్‌రావు, 11వ బెటాలియన్ హెడ్‌కానిస్టేబుళ్లు మోహన్, ఓబులేసు, ప్రొద్దుటూరు ఫైర్ సర్వీసు లీడింగ్ ఫైర్‌మెన్ నారాయణరెడ్డి, కడప ఫైర్ స్టేషన్‌లో పనిచేస్తున్న డ్రైవర్/ఆపరేటర్ సేవా పతకాలకు ఎంపికయ్యారు.

బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య


నవ్య మృతదేహం

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 21: మండల పరిధిలోని గౌతమి మహిళా ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన బీటెక్ విద్యార్థిని నవ్య ఆత్మహత్య చేసుకున్నట్లు కళాశాల నిర్వాహకులు తెలిపారు. గురువారం ఉదయం కళాశాలలో పరీక్ష రాసిన కంప్యూటర్ సైన్స్ మొదటి సంవత్సరం విద్యార్థిని నవ్య ఆరోగ్యం బాగోలేదని హాస్టల్‌కు వెళ్లింది.

సాయంత్రం నాలుగు గంటలకు కళాశాల విద్యార్థినులు హాస్టల్‌కు చేరుకున్నారు. హాస్టల్ తలుపులు మూసి ఉండడంతో ఎంతసేపు పిలిచినా పలకకపోవడంతో బలవంతంగా తలుపులు తెరిచారు. ఆ విద్యార్థి ఫ్యానుకు ఉరి వేసుకుని కనిపించింది. ఆందోళన చెందిన విద్యార్థులు పాఠశాల నిర్వాహకులకు తెలిపారు. ఆ విద్యార్థిని చికిత్స కోసం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. డాక్టర్లు పరీక్షించి ఆమె అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు. దీనిపై పోలీసులు విచారణ చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఆ విద్యార్థిని గుంతకల్ వాసి అని కళాశాల నిర్వాహకులు తెలిపారు.

పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలి



పోషకాహార విలువలపై వివరిస్తున్న సీడీపీఓ సునీత

వేంపల్లె, మార్చి 21: ప్రతి గర్భిణీ, బాలింత తప్పనిసరిగా పౌష్టికాహారాన్ని తీసుకోవాలని, దీనిద్వారా పిల్లలు పోషకాహార లోపం ఎదుర్కోరని వేంపల్లె సీడీపీఓ సునీత అన్నారు. గురువారం బిడాలమిట్ట అంగన్వాడీ కేంద్రంలో పోషణ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. పోషక విలువలున్న కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు తదితర ఆహార పదార్థాలను వివరించారు. కార్యక్రమంలో విస్తరణ అధికారి స్వర్ణలత,అంగన్వాడీలు పాల్గొన్నారు.

హోలి సంబరాలను జయప్రదం చేయండి

కడప (మారుతీనగర్), మార్చి 21 : హోలి పర్వదినం సందర్భంగా ఈ నెల 24న ప్రత్యేక హోలి సంబరాల కార్యక్రమం నిర్వహించనున్నామని, ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం నాయకులు శివనాయక్, వేణుగోపాలనాయక్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎర్రముక్కపల్లెలోని ఆ సంఘం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆదివారం ఉదయం హోలి సందర్భంగా సాంప్రదాయ పద్ధతిలో ముగ్గుల పోటీలు, చైర్ కాంపిటీషన్, లెమన్ స్పూన్, బంజారా వేషధారణలో డ్యాన్సులు, కోలాటాలు ఉంటాయన్నారు. మధ్యాహ్నం అక్కడే భోజనం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గిరిజన శాఖ జిల్లా అధికారి నాగభూషణం, ఆఫీసు సూపరింటెండెంట్ సురేష్, హోలి నిర్వాహకులు వేణుగోపాలనాయక్, డాక్టర్ ఐ.శివానాయక్, వెంకటస్వామి నాయక్, అర్జున్ నాయక్, బీడీ నాయక్, కృష్ణనాయక్, పీరునాయక్ పాల్గొన్నారు.

మాధవీరెడ్డికి నోటీసులు

కడప(కలెక్టరేట్), మార్చి21: గత 10 ఏళ్ల పాలనలో కడప ప్రజలకు ఏమి చేశారని, వ్యక్తిగత ఆస్తులు పెంచుకున్నారని ప్రశ్నిస్తూ మాజీ మంత్రి అంజాద్ బాషాకు ఫేస్‌బుక్ అకౌంట్ నుంచి పోస్టు పెట్టడంపై టీడీపీ కడప నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి రెడ్డప్పగారి మాధవీ రెడ్డికి కడప అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి మధుసూదన్ సంజాయిషీ కోరుతూ నోటీసు జారీ చేశారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘన కింద వెంటనే అభ్యంతరకర పోస్టింగ్ తొలగించి సంజాయిషీ తెలపాలని గురువారం జారీ చేసిన నోటీసులో పేర్కొన్నారు.

కమిషనరుపై విచారణ జరిపించాలి: టీడీపీ



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ కౌన్సిలర్లు

కమలాపురం రూరల్, మార్చి 21 : వైఎస్ఆర్ జిల్లా కమలాపురం నగర పంచాయతీ మున్సిపల్ కమిషనరుపై విచారణ జరిపించాలని టీడీపీ కౌన్సిలర్ బాబుల్, మహ్మద్‌రఫి, షేక్ రిహానా, ఏఆర్వో సుబ్రమణ్యంకు గురువారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కమలాపురం నగర పంచాయతీలో కమిషనరు రాముడు వైసీపీకి తొత్తుగా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదు చేశామన్నారు. సొంత జిల్లా వాసి ఎలక్షన్ టైంలో ఇక్కడ ఎలా పనిచేస్తారన్నారు. ఇప్పుడున్న కమిషనరును తొలగించి కొత్త కమిషనరును నియమించాలని వారు కోరారు. ప్రస్తుతం కమలాపురం నగర పంచాయతీ కమిషనరు ఎన్నికల కోడ్ నియమావళి ప్రకారం సొంత జిల్లాలో పని చేయవచ్చా అని ప్రశ్నించారు. కమిషనరు ఎన్నికల నియమావళికి విరుద్ధంగా ప్రవర్తించడమే కాకుండా అధికార వైసీపీకి భజన చేస్తూ ఆ పార్టీకి తొత్తుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కమిషనరుపై న్యాయ విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆప్కో వస్త్రాలపై 30 నుంచి 50 శాతం రిబేటు

కడప (మారుతీనగర్), మార్చి 21: రానున్న ఉగాది, రంజాన్, శ్రీరామనవమి పర్వదినాల సందర్భంగా జిల్లాలోని అన్ని చేనేత వస్త్రాల కొనుగోలుపై 30 నుంచి 50 శాతం రిబేటు సౌకర్యం కలదని ఆప్కో కడప మండల వాణిజ్య కార్యాలయ అధికారి ఆర్. రమేష్‌కుమార్ తెలిపారు. ఏపీ రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ విజయవాడ కేంద్ర కార్యాలయ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు అన్ని చేనేత వాస్త్రాలపై తగ్గింపు ఇస్తున్నట్లు తెలిపారు. కాగా క్లియరెన్స్ సేల్స్ కౌంటర్‌లో (కడప హెడ్ పోస్టాఫీస్ పక్కన) గల ఆప్కో వస్త్రాలయంలో అన్ని రకాల చేనేత వస్త్రాలపై 1 ప్లస్ 1, 1 ప్లస్ 2 విక్రయాలకు అనుమతి ఉందన్నారు.

యాలి వాహనంపై శ్రీనివాసుడు

బద్వేలు రూరల్, మార్చి 21: మండల పరిధిలోని లక్ష్మిపాలెం గ్రామంలో వెలసిన ప్రసన్న వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి యాలి వాహనంపై శ్రీనివాసుడు ఊరేగాడు. భక్తులు కాయ కర్పూరం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి... పూజల్లో పాల్గొన్న పుత్తా దంపతులు

వల్లూరు, మార్చి 21 : మండల పరిధిలోని పాపాఘ్నినది తీరంలో మాచిరెడ్డిపల్లె గ్రామంలో పుత్తా నరసింహారెడ్డి కుటుంబీకులచే ప్రతిష్ఠంచబడిన శ్రీలక్ష్మి నరసింహస్వామి 28వ బ్రహ్మోత్సవాల్లో గురువారం అంకు రార్పణతో వైభవంగా ప్రారంభమయ్యాయి. అనంతరం విశ్వక్సేన ఆరాధన నిర్వహించి మహాసంకల్పం పఠించారు. ఆలయ శుద్ధి కోసం వాస్తుపూజ చేశారు. అనంతరం యాగశాల ప్రవేశించి బ్రహ్మోత్సవాలు ప్రారంభించారు.

అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ప్రతి సంవత్సరంలాగే ఈ ఏడాది కూడా లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు అంకురార్పణతో పుత్తా నరసింహారెడ్డి, ఆయన సతీమణి సరళమ్మ కుమారులు కృష్ణచైతన్య దంపతుల ఆధ్వర్యంలో ప్రారంభమ య్యాయి. పుట్టమన్ను తీసుకువచ్చి నవధాన్యాలను శుద్ధి చేసి అంకురార్పణ చేశారు. అనంతరం అఖండ దీపారాధన, మంటపపూజ నిర్వహించారు. ధ్వజపీటకు పూజ చేసి ధ్వజారోహణం చేశారు. అంకురారోణ అనంతరం అగ్నిప్రతిష్ఠ చేశారు. వివిధ పూజల అనంతరం మూలవిరాట్ లక్ష్మీనరసింహునికి మహామంగళహారతి అందించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోండి

● ఓటర్లను చైతన్యవంతం చేసేందుకు చెన్నూరులో ర్యాలీ



చెన్నూరులో ఓటర్లలో చైతన్యం, అవగాహనపై ర్యాలీ చేస్తున్న దృశ్యం

చెన్నూరు, మార్చి 21 :మండలంలోని ప్రతిఓటరు తమ విలువైన ఓటు సద్వినియోగం చేసుకోవాలని, దుర్వినియోగం చేయవద్దని, పోలింగ్ రోజు తప్పక హాజరు కావాలలని తహసీల్దారు ప్రకాష్‌బాబు సూచించారు. చెన్నూరులో గురువారం ఓటర్లను చైతన్యవంతం చేయడం, అందులో ప్రజలను భాగస్వాములు చేయడం వంటి వాటిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మేజరు గ్రామ పంచాయతీ చెన్నూరులో వీధివీధినా రెవెన్యూ సిబ్బంది, బీఎల్‌వోలు ర్యాలీ నిర్వహిస్తూ ఓటు హక్కు ప్రాముఖ్యత గురించి వివరించారు. అలాగే ఫారం-6, 6ఎ, 7, 8 వంటి వాటిపై అవగాహన కల్పించారు. ప్రజాస్వామ్యంలో వజ్రాయుధంతో సమానమైన ఓటును ప్రజలు తమను తాము అభివృద్ధి పరుచుకునేందుకే ఉపయోగించుటారని, అలాంటి ఓటును పోలింగ్ రోజున తప్పకుండా హాజరై నిర్భయంగా ఓటు వేసుకోవాలన్నారు. ఐదేళ్లకొక మారు వచ్చే ఏ ఓటు అయినా దేశాభివృద్ధిలో కీలకమన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. మనం ఓటు వేస్తే ఏమి, వేయకంటే ఏమి అన్న ధోరణి మానుకోవాలని అన్నారు. అలాగే ఓటరు ఓటు నమోదు చేసుకోవాలన్నా, ఓటు తొలగించుకోవాలన్నా మరో చోటకు బదిలీ చేసుకోవాల న్నా వాటికి వేర్వేరుగా దరకాస్తులు ఉంటాయన్నారు. అందుకే గ్రామస్థాయి నుండి దేశ స్థాయి వరకు అందరు ప్రజాప్రతినిధుల ఎన్నికకు ఈ ఓటు ఎంతోకీలకమని, ఓటు లేకంటే ప్రజాస్వామ్యంలో మనుగడ లేదన్నారు. వీరపునాయుపల్లె తహసీల్దారు అమర్‌నాథ్ మాట్లాడుతూ వజ్రాయుధం కన్నా ఓటే పవర్‌ఫుల్ అని, అలాంటి ఓటును నిర్లక్ష్యం చేయడం, దుర్వినియోగం చేయడం తగదన్నారు. ఎన్నికల రోజు తమ ఓటును సక్రమంగా వినియోగించుకోవాలని తప్పుడు ఓట్లకు అవకాశం ఇవ్వకూడదని చెన్నూరు ప్రజలకు పదే పదే విన్నవించారు. కార్యక్రమంలో డీటీ వెంకటరమణ, శివతో పాటు రెవెన్యూసిబ్బంది పాల్గొన్నారు.

క్షయవ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ సుబ్బరాయుడు

కడప (మారుతీనగర్), మార్చి 21: క్షయ వ్యాధి అంటు వ్యాధి అని, త్వరితగతిన ఇతరులకు వ్యాపించే వీలుందని కావున ఆ వ్యాధి దరిచేరకుండా ఉండేలా అప్రమత్తంగా ఉండాలని క్షయ వ్యాధి నివారణ కేంద్రం సూపర్‌వైజర్ డాక్టర్ సుబ్బరాయుడు సూచించారు. క్షయవ్యాధి నివారణ వారోత్సవాలను పురస్కరించుకుని జిల్లా క్షయవ్యాధి నివారణ కేంద్రం ఆధ్వర్యంలో గురువారం స్థానిక పాతరిమ్స్‌లోని ఆదరణ షెల్టర్‌లో క్షయవ్యాధి నివారణ వారోత్సవాలకు సంబంధించి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధిగ్రస్థులు తుమ్మినపుడు, దగ్గినపుడు వారి నోటి ద్వారా బయటకు వచ్చే తుంపర్లు గాలిలో కలిసి ఇతరులకు వ్యాధి వ్యాప్తి చెందే అవకాశాలున్నాయన్నారు. కావున వ్యాధిగ్రస్థులు తుమ్మేసమయంలోనూ, దగ్గే సమయంలోనూ గుడ్డను నోటి, ముక్కు దగ్గర ఉంచుకోవాలన్నారు. క్షయవ్యాధి ఎలా దరిచేరుతుంది, ఆ వ్యాధిని కనుగొనడం ఎలా, ప్రభుత్వం క్షయవ్యాధికి చేస్తున్న పరీక్షలు, నివారణకు ఇచ్చే ఉచిత మందులు వాటిని వాడకం తదితర విషయాలను షెల్టర్‌లోని నిరాశ్రయులకు వివరించారు. ప్రభుత్వం ఉచితంగా ఇచ్చే మందుల వాడకం వలన ఆరు నెలల వ్యవధిలో వ్యాధి పూర్తిగా నయ మవు తుందన్నారు. కావున క్షయవ్యాధి బాధితులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఆదరణ నిరాశ్రయ నిర్వాహకుడు విజయబాబు, నివారణ కేంద్రం సిబ్బంది ప్రవీణ్‌కుమార్, బి. ధనుంజయ, పి. శ్రీధర్, ఆదరణ మేనేజర్ అనూష,తో పాటుగా పలువురు నిరాశ్రయులు పాల్గొన్నారు.

మానసిక ప్రశాంతతతోనే సంతోషకర జీవితం: సీఐ



చెన్నూరులో కేంద్ర బలగాలతో పోలీసు కవాతు.. వల్లూరులో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

చెన్నూరు, మార్చి 21 : సమాజంలో ప్రతి వ్యక్తి ప్రశాంతతో కూడిన జీవితాన్ని గడిపితే సంతోషంగా ఉంటారని, ఎలాంటి బేషజాలకు, పట్టుదలకు పోకండా ఉండాలని సీఐ పార్థసారధి అన్నారు. మండలంలోని రాచిన్నాయపల్లెలో ఎన్నికలు సమీపిస్తతన్నసందర్భంగా కేంద్ర బలగాలతో ఆయన కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రాచిన్నాయపల్లె గ్రామం గతంలో గొడవలు, ఘర్షణలకు తదితర సమస్యలకు నిలయంగా ఉండేదని, ఇప్పుడు ఆ పరిస్థితి మార్చుకోవాల్సిన పద్ధతి ప్రజలదేనన్నారు. గొడవలు, ఘర్షణల వల్ల సమస్యలు పెరగడం తప్ప తగ్గదని పైగా కేసులు నమోదు చేయించుకుని కోర్టులు, పోలీసుస్టేషన్ల చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పడవద్దన్నారు. అందరూ సంతోషంగా ఉండాలి, అందులోమనం ఉండాలి అన్న విధానంతో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలన్నారు. అలా కాకుండా తమ పద్ధతి తమదే అంటే మాత్రం పోలీసు తమదైన శైలిలో వారికి సమాధానం చెబుతారని, అంత పరిస్థితి తెచ్చుకోవద్దన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐలు జాకీర్ హుసేన్, నరసింహులు, వెంకటరాముడు, ఏవీ సుబ్బయ్య, రామిరెడ్డి, శ్రీనివాసరాజు, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల కవాతు

వల్లూరు, మార్చి 21 : ఎన్నికల దృష్ట్యా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల కేంద్రమైన వల్లూరు తదితర గ్రామాల్లో పోలీసులు రిజర్వు పోలీసులు కవాతు చేశారు. ఈ కవాతు ఎస్ఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ ఎన్నికల వేళ ప్రశాంతంగా ఉండాలని అన్నారు. ఘర్షణలకు తావుండకూడదన్నారు. నిబంధనలను పాటించాలన్నారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి

కడప (ఎడ్యుకేషన్), మార్చి 21 : కడప కార్పొరేషన్ పరిధిలో నీటిని పొదుపుగా వాడుకోవాలని డీఈ కరీముల్లా గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత మూడు సంవత్సరాలుగా రాష్ట్రంలో తగినంత వర్షపాతం నమోదు కానందున అలాగే ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో నీటిమట్టం అడుగంటిందని, ప్రజలకు తాగునీటి సరఫరాలో అంతరాయం కలిగిందని తెలిపారు. పెన్నా, బుగ్గవంకలో బోర్లలో కూడా నీరు అడుగంటిందన్నారు. 50.92 ఎంఎల్‌డీ కావాల్సినంత ఉండగా 37.80 ఎంఎల్‌డీ మాత్రమే వస్తున్నట్లు తెలిపారు. 13.12 ఎంఎల్‌డీలు నీటి కొరత ఉందని తెలిపారు. అలాగే కలెక్టరు, కమిషనరు ఆదేశాల మేరకు గండికోట నుంచి మైలవరానికి మైలవరం నుంచి లింగంపల్లె పంప్ హౌస్ వరకు నీరు వదిలేందుకు తగు చర్యలు తీసుకున్నామన్నారు. మైలవరం రిజర్వాయరు నుంచి పెన్నానదికి ఈ నెల 1న 160 క్యూసెక్కుల నీటిని విడిచిపెట్టినట్లు తెలిపారు. కలెక్టరు, కమిషనరు ఆదేశాల మేరకు 20న మరో 200 క్యూసెక్కుల వరకు పెంచామన్నారు. మైలవరం 60 కి.మీ దూరం ఉన్నందున విడుదల చేసిన నీటిలో 40 శాతం మాత్రమే నీరు వస్తున్నట్లు తెలిపారు. వదిలిన నీరు నిల్వ ఉండేందుకు ముందు జాగ్రత్త చర్యగా లింగంపల్లెలో తాత్కాలికంగా సిమెంటు సంచులతో కట్టను నిర్మించినట్లు పేర్కొన్నారు. ఆ నీరు కడప నగరం సమీపంలో లింగంపల్లె చేరేందుకు మరో వారం రోజులు పడుతుందని, అందులోభాగంగా తాగునీటి సమస్య లేకుండా చేసేందుకు 39కొత్త బోర్ల ఏర్పాటుకు కమిషనర్ చర్యలు చేపట్టారని తెలిపారు. నీటతి పైపుల ఇంటర్ కనెక్షన్‌లు, 16 ప్రైవేటు వాటర్ ట్యాంకర్లు పెన్నానది నుండి 8 ఫిల్టర్ పాయింట్లు పంపు సెట్లు, బోర్లు మరమర్మత్తులు ప్రైవేటు బోర్లు కూడా అద్దెకు తీసుకున్నామన్నారు. దీనికి సంబంధించి 1.89 కోట్లు టెండర్లు పిలవడం జరిగిందని పనులు కూడా జరుగుతున్నాయన్నారు. పెన్నానదిలో నీటి మట్టం పెరిగిన వెంటనే తాగునీటి సమస్య లేకండా ప్రజలకు సరఫరా చేస్తామని వివరించారు.

'మేనరిక వివాహాలకు దూరంగా ఉండండి'



కార్యక్రమంలో మాట్లాడుతున్న రఫి

కడప (మారుతీనగర్), మార్చి 21: వీలైనంత వరకు మేనరిక వివాహాలకు దూరంగా ఉండాలని అల్‌షిఫా కేంద్రం వ్యవస్థాపకుడు ఎస్. మహమ్మద్ రఫీ ప్రజలకు సూచించారు. ప్రపంచ డౌన్ సిండ్రోమ్ దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక పాతరిమ్స్‌లో గల అల్‌షిఫా మానసిక దివ్యాంగ పునరావాస కేంద్రంలో తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డౌన్ సిండ్రోమ్ అనేది క్రోమోజోమ్ సాధారణ పరిస్థితిలో ఏర్పడుతుందన్నారు. మానవ శరీరంలో 21 జతల క్రోమోజోములకు అదనంగా ఒక క్రోమోజోమ్ ఉంటే డౌన్ సిండ్రోమ్ పట్టే అవకాశం ఉంటుందన్నారు. ప్రధానంగా దాని భౌతిక లక్షణాలు చదునైన ముఖం, బాదం ఆకారంలో కళ్లు, చిన్న మెడ, చిన్న చెవులు, నోటిలో నుంచి బయటకు వచ్చేలా నాలుక, చిన్న చేతులు, కాళ్ళు, పిల్లలు- పెద్దలు ఎత్తు తక్కువగా ఉండడం తదితర లక్షణాలుంటాయన్నారు. ఇది 700 మంది శిశువులలో ఒకరికి సంభవిస్తుందన్నారు. సాధారణంగా గర్భధారణ సమయంలో 35 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు ఉన్న తల్లులకు అలాంటి పిల్లలు జన్మిస్తారన్నారు. కావున గర్భధారణ సమయం- వయస్సుతో పాటు వీలైనంత వరకు మేనరిక వివాహాలకు దూరంగా ఉండాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డౌన్ సిండ్రోమ్ పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

పగలురాత్రీ వెలుగుతున్నా పట్టించుకునే వారేరీ?



బుగ్గలేటిపల్లెలో నిరంతరం వెలుగుతున్న విద్యుత్తు దీపాలు

సీకేదిన్నె, మార్చి 21: రాత్రిపూట వాహనదారులు, ప్రజలు ఇబ్బంది పడకూడదనే సదుద్దేశ్యంతో ఏర్పాటు చేసిన విద్యుత్తు దీపాలు నిరంతరం వెలుగుతున్నాయి. దీంతో విలువైన విద్యుత్తు, ప్రజాధనం వృథా అవుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. గత కొంతకాలంగా కడప-రాయచోటి జాతీయ రహదారిలోని బుగ్గలేటిపల్లె గ్రామంలో ఏర్పాటు చేసిన విద్యుత్తు దీపాలు నిర్వహణ సరిగా లేక సగం లైట్లే వెలుగుతున్నాయని, సగం లైట్లు అసలు వెలుగటంలేదని తెలిపారు. వెలిగే ఆ సగం లైట్లు కూడా రాత్రీపగలు తేడా లేకుండా వెలుగుతూనే ఉన్నాయన్నారు. ఇప్పటికైనా అధికారులు, జాతీయ రహదారుల అధికారుల స్పందించి అన్నిలైట్లు వెలిగేలా చూసి పగటిపూట వెలుగకుండా రాత్రి మాత్రమే వెలిగేలా చర్యలు తీసుకుని ప్రజా ధనం వృథా కాకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలి



మందులు పంపిణీ చేస్తున్న డాక్టర్ షాకీర్ హుసేన్

కమలాపురం రూరల్, మార్చి 21 : ప్రస్తుతం ఎండలు అధికంగా ఉన్నాయని, వడదెబ్బత తగలకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని హోమియోపతి వైద్యశాల డాక్టర్ షాకీర్‌హుసేన్ పేర్కొన్నారు. గురువారం నగర పంచాయతీలోని అప్పాయపల్లె ఎలిమెంటరీ స్కూలులో డాక్టర్ షాకీర్‌హుసేన్ ఆధ్వర్యంలో హోమియోపతి వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలం కాబట్టి ఎండలు అధికంగా ఉన్నాయని చిన్నారులు, వృద్ధులు ఎండలో తిరగవద్దన్నారు. బయట తిరిగేటప్పుడు తలపై టవలు కానీ, టోపీ కానీ గొడుగు కానీ ధరించి వెళ్లాలన్నారు. వడదెబ్బ తగిలినప్పుడు హోమియోపతిలో మంచి మందులు ఉన్నాయని అవసరమైన వారందరూ వాడుకోవాలన్నారు. నీరసంగా అనిపించినా వాంతులు అవుతున్నా వెంటనే డాక్టరును సంప్రదించాలన్నారు. మజ్జిగ, నీళ్ల, కొబ్బరి నీళ్ల లాంటివి రోజూ తీసుకుంటుండాలన్నారు. ఈ సందర్భంగా మందులు అందించారు. పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తీసుకోవాలి

● డీఈఓకు విద్యార్థి, యువజన సంఘాల వినతి



డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కడప (ఎడ్యుకేషన్), మార్చి 21 : పాఠశాల విద్యహక్కు చట్టం నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలల్లో భర్తీ చేసేందుకు అక్రమంగా ప్రతిభా పరీక్షలు నిర్వహిస్తు న్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి యువజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం కడప నగరం డీఈవో కార్యాలయంలో డీఈఓ అనురాధకు వినతిపత్రం అందించారు. అనంతరం పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు అంకన్న, పీఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, ఎఐఎస్‌బీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి జయవర్ధన్‌లు మాట్లాడుతూ కడపనగరంలో ఓ ఇంటర్నేషనల్ పాఠశాల అలాగే ప్రొద్దుటూరులో మరో ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలు వచ్చే ఆదివారం సోమవారం సోషల్ మీడియా వేదికగా ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ప్రచారం చేసుకుంటున్నారన్నారు. దీనిపై విచారణ జరిపి తక్షణం చర్యలు తీసుకోవాలని డీఈవోను కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యు నాయకులు త్రినాధ్‌యాదవ్, ఎఐవైఎఫ్ ఓబయ్య, మనోజ్ పాల్గొన్నారు.

పదోతరగతి మూల్యాంకన కేంద్రంలో సౌకర్యాలు కల్పించాలి

● డీఈఓకు యూటీఎఫ్ వినతి

కడప (ఎడ్యుకేషన్), మార్చి 21 : పదోతరగతి మూల్యాంకన విధుల్లో పా ల్గొనే ఉపాధ్యాయులకు సౌ కర్యాలు కల్పించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజయకుమార్, పాలెం మహేష్‌బాబు డిమాండ్ చేశారు. గురువారం డీఈఓ కార్యాయలంలో డీఈఓ అనురాధకు వినతిపత్రం అందించారు. అ నంతరం మాట్లాడుతూ ఏప్రిల్ 1 నుంచి జరగనున్న పదోతరగతి మూల్యాంకన విధులు నిర్వహిచే ఉపాధ్యాయులకు తగిన మినహాయింపు, సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. 58 సంవత్సరాలు దాటిన ఉపాధ్యాయులు, గర్భవతులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి మినహాయింపునివ్వాలని కోరారు. వేసవి తీవ్రత దృష్ట్యా మూల్యాంకన కేంద్రంలో వసతిసౌకర్యాలు మెరుగుపరుచాలన్నారు. తాగునీరు, మజ్జిగ సరఫరా చేయాలని మూల్యాకంన కేంద్రంలో తగినన్ని ఫ్యాన్లు, కూలర్లు ఏర్పాటు చేయాలని చలువ పందిర్లను ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం డీఈవో అనురాధ సానుకూలంగాస్పందిస్తూ మూల్యాంకన కేంద్రాల్లో తగు సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు రవికుమార్, గోపినాథ్, చంద్రశేఖర్, వై.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కొండపేట బలిజ సంఘం నేత టీడీపీలో చేరిక

● కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించిన పుత్తా చైతన్య



రాజేష్‌ను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న పుత్తా చైతన్యరెడ్డి

చెన్నూరు, మార్చి 21: మండలంలో బలమైన నాయకుడిగా బలిజ సంఘం నేతగా ఉన్న కొండపేటకు చెందిన గుడిపాటి రాజేష్ గురువారం యువనేత పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. మొన్నటి వరకు గుడిపాటి రాజేష్ తల్లి గుడిపాటి కుమారి కొండపేటకు ఉప సర్పంచ్‌గా పనిచేశారు. ప్రస్తుతం ఆమె రాజీనామా చేయడంతో కుమారుడు గుడిపాటి రాజేష్ టీడీపీలో చేరారు. చాలా కాలంగా టీడీపీలోకి రప్పించేందుకు ఆ గ్రామ మాజీ సర్పంచ్‌లు మోహన్‌రెడ్డి, బలిజ సంఘం నేతలు రోడ్డ సునీల్, గుడిపాటి మనోజ్, జింకా శివప్రసాద్ గట్టి ప్రయత్నాలు చేశారు. ఆయన్ను ఎట్టకేలకు టీడీపీలోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా యువనేత చైతన్యరెడ్డి మాట్లాడుతూ జనసేన టీడీపీతో కలవడం గొప్ప శుభసూచకమని, అంతేకాక ఆది నుంచి బలిజ సామాజిక వర్గం టీడీపీకి ఎంతో వెన్నుదన్నుగా ఉండి పార్టీ విజయానికి కృషి చేస్తోందన్నారు. ఇప్పుడు కొండపేట గ్రామంలో బలిజసామాజిక వర్గం టీడీపీలో చేరడంతో మండల వ్యాప్తంగా ఆయన ప్రభావం బలిజ సంఘం నేతలపై ఉందన్నారు. ఇది టీడీపీ విజయానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. టీడీపీ యువనేతలు సంజీవ్‌పవన్, మండల కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డి, పొట్టిపాటి ప్రతాప్‌రెడ్డి, మల్లిఖార్జునరెడ్డి, కుంచెం రామక్రిష్టారెడ్డి, ఆవుల పవన్‌కుమార్‌రెడ్డి పెద్దసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితుడిని పరామర్శించిన పుత్తా చైతన్యరెడ్డి

ఉప్పరపల్లె గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై ఇంటి వద్ద ఉన్న టీడీపీ సీనియర్ నేత ఆవుల మల్లేశ్వర్‌రెడ్డిని గురువారం యువనేత పుత్తా చైతన్యరెడ్డి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.అనంతరం చెన్నూరులో పలువురు గ్రామ పెద్దలు, నాయకులతో ఆయన మంతనాలు జరిపారు. టీడీపీకి మద్దతునివ్వాలని వారిని కోరారు. టీడీపీ అధికారంలోకి రాగానే పూర్తిస్థాయిలో అండదండలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ రామకోటిరెడ్డి, గుణ, సుధాకర రెడ్డి, శివ, దుగ్గనపల్లె శివ, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

పులివెందుల రూరల్, మార్చి 21: పులివెందుల ఏపీఎస్ఆర్‌టీసీ నందు శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ రామకృష్ణ తెలిపారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్న 12గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. ఫిర్యాదులు, సూచనలు, సలహాలు ఇవ్వదలచిన వారు 9959225780కు ఫోన్ చేయాలన్నారు. వాట్సప్ మెసేజ్ చేయవచ్చన్నారు.

విద్యార్థులు శాస్త్రీయ వైఖరిని అలవర్చుకోవాలి

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 21: విద్యార్థులు శాస్త్రీయ వైఖరిని అలవర్చుకోవాలని జనవిజ్ఞాన వేదిక వ్యవస్థాపకుడు డాక్టర్ బ్రహ్మానందరెడ్డి తెలిపారు. గురువారం రాణి తిరుమలదేవి డిగ్రీ కళాశాలలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యార్థి చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో దేశంలో పెద్ద ఎత్తున దోపిడీ జరుగుతోందని, దోపిడీపై విద్యార్థులు ప్రజలను చైతన్యవంతులను చేయాలని కోరారు. వ్యక్తిత్వ వికాసం హక్కులు, బాధ్యతలు అన్న అంశం గురించి విద్యార్థులకు వివరించారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం... నారా భువనేశ్వరి


పోరుమామిళ్లలో ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న నారా భువనేశ్వరి

పోరుమామిళ్ల, మార్చి 21: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని చంద్రబాబు సతీమణి భువనేశ్వరి అన్నారు. గురువారం సాయంత్రం నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా పోరుమామిళ్ల పంచాయతీ పరిధిలోని కొత్తవీధి, బలిజకోటలోని టీడీపీ కుటుంబాలను పరామర్శించారు. చంద్రబాబు అరెస్టును జీర్ణించుకోలేక వత్తిడికి గురై మృతి చెందిన కొత్త వీధిలోని నెంబరువలి కోడలు సయ్యద్ మహబూబ్‌చాంద్ కుటుంబాన్ని, బలిజకోటలోని మున్నెల్లి అంకమ్మ కుటుంబాలను ఆమె పరామర్శించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ చంద్రబాబునాయుడుపై అక్రమంగా తప్పుడు కేసులు బనాయించి 53 రోజులు జైల్లో ఉంచేలా చేశారని.. అది జీర్ణించుకోలేని టీడీపీ కార్యకర్తలు మనస్థాపానికి గురై దాదాపు 206 మంది మృతి చెందారన్నారు. పార్టీ తరపున ఆ కుటుంబాలకు అండగా ఉంటామని ఆమె భరోసా ఇచ్చారు. చంద్రబాబుపై పెట్టిన కేసులు ఇప్పటి వరకు రుజువు చేయలేక పోయారన్నారు. రాష్ట్రంలో రాజధాని లేకుండా చేసిన ఈ ప్రభుత్వాన్ని రాబోవు రోజుల్లో ఓటు ద్వారా గద్దెదించాలన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఇసుక మాఫియా, భూకబ్జాలు, లిక్కరు మాఫియాలు రాజ్యమేలుతున్నాయని విమర్శించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాదు అభివృద్ధి చేయడం చంద్రబాబుతోనే సాధ్యపడిందన్నారు. ఆయన పాలనలోనే రాష్ట్రంలో అన్ని వర్గాల వారికి న్యాయం జరిగిందన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే మహిళలకు నెలకు రూ.1500, తల్లికి వందనం పథకం కింద ఇంట్లో ఎంత మంది పిల్ల లున్నా వారికి ఒక్కొక్కరికి ఏడాదికి రూ.15వేలు అందిస్తామన్నారు. కాగా నారా భువనేశ్వరి తొలిసారిగా పోరుమామిళ్లకు విచ్చేయడంతో ఆమెను చూసేందుకు మహిళలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, కడప ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, యువనేత రితీష్‌రెడ్డి, టీడీపీ ఇన్‌చార్జ్ బొజ్జ రోశన్న, ఆయన సతీమణి అరుణమ్మ, పోరుమామిళ్ల సర్పంచ్ యనమల సుధాకర్, మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్‌లు చెరుకూరి చెన్నరాయుడు, సాధనకారి రంతు, టీడీపీ నేతలు నగరి భైరవ ప్రసాద్, సీతా వెంకటసుబ్బయ్య, హబీబున్నీసా, కొండా రామక్రిష్ణారెడ్డి, కల్వకూరి నడిపి వెంకటసుబ్బయ్య, చిన్నవెంకటసుబ్బయ్య, ఇమాం హుసేన్, కార్యకర్తలు పాల్గొన్నారు.


అట్లూరులో భువనేశ్వరికి స్వాగతం పలుకుతున్న టీడీపీ నాయకులు

నారా భువనేశ్వరికి ఘన స్వాగతం

అట్లూరు, మార్చి 21 : మండల కేంద్రమైన అట్లూరు క్రాస్ రోడ్డు వద్ద నిజం గెలవాలి కార్యక్రమానికి విచ్చేసిన నారా భువనేశ్వరికి బద్వేలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, యువనేత రితీష్‌కుమార్‌రెడ్డి కమలాపురం ఇన్‌చార్జ్ పుత్తా చైతన్యరెడ్డి, జమ్మలమడుగు ఇన్‌చార్జ్ భూపేష్ రెడ్డి, అట్లూరు మండల అధ్యక్షుడు పి.మల్లిఖార్జునరెడ్డిలు ఆమెకు పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. టీడీపీ మాజీ పార్లమెంటరీ అధ్యక్షురాలు సుధారాణి, కొండూరు ఎంపీటీసీ గోవిళ్ల లక్ష్మి, మండల ఇన్‌చార్జ్ రెడ్డయ్య, అమర్‌నాథరెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, జయక్రిష్ణారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, మద్దిక పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీని ఆదరించండి.. భూపేశ్‌ను గెలిపించండి


ప్రజలకు కరపత్రాలు పంచుతున్న టీడీపీ మహిళానాయకురాళ్లు

పెద్దముడియం, మార్చి 21: రానున్న ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేసి ఆదరించాలని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జ్ భూపేష్‌రెడ్డి తల్లి సరస్వతమ్మ ప్రజలను కోరారు. మండల పరిధిలోని నెమళ్లదిన్నె గ్రామంలో గురువారం బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భూపేష్‌రెడ్డి తల్లి సరస్వతమ్మ, భార్య జ్యోతమ్మ, చెల్లెలు ప్రశాంతమ్మ ఇంటింటా తిరుగుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీని ఆదరించాలని ప్రజలను కోరారు. సంక్షేమం, అభివృద్ధి కోసం సూపర్‌సిక్స్ పేరుతో టీడీపీ మేనిఫెస్టో విడుదల చేసిందన్నారు. జమ్మలమడుగు టీడీపీ అభ్యర్థి భూపేష్‌రెడ్డిని గెలిపించాలని.. రాష్ట్ర అభివృద్ధి కోసం చంద్రబాబును సీఎం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. టీడీపీ మహిళా నాయకులు మాధవీ, లక్ష్మీదేవమ్మ, ప్రసన్న, మునెమ్మ, శివనాగమ్మ, ఇతర నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రీయ వైఖరిని అలవర్చుకోవాలి


రక్తదానం చేస్తున్న విద్యార్థులు

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 21: విద్యార్థులు శాస్త్రీయ వైఖరిని అలవర్చుకోవాలని జనవిజ్ఞాన వేదిక వ్యవస్థాపకుడు డాక్టర్ బ్రహ్మానందరెడ్డి తెలిపారు. గురువారం రాణి తిరుమలదేవి డిగ్రీ కళాశాలలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యార్థి చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో దేశంలో పెద్ద ఎత్తున దోపిడీ జరుగుతోందని, దోపిడీపై విద్యార్థులు ప్రజలను చైతన్యవంతులను చేయాలని కోరారు. వ్యక్తిత్వ వికాసం హక్కులు, బాధ్యతలు అన్న అంశం గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించి విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ చంద్రశేఖర్‌రెడ్డి, కరస్పాండెంట్ తరునేందుశేఖర్, ఇన్‌చార్జి ప్రిన్సిపల్ వెంకటేశ్వరరెడ్డి, అధ్యాపకులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు వలరాజు, జేవీవీ నాయకులు శ్రీరాములు, రమణయ్య, రాంబాబు, విరసం వరలక్ష్మి, పల్లవోలు రమణ, చంద్రశేఖర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బాలత్రిపుర సుందరీదేవి వార్షికోత్సవ వేడుకలు


ప్రత్యేక అలంకరణలో త్రిపురసుందరీదేవి, పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ దేవగుడి శివనాథరెడ్డి దంపతులు

జమ్మలమడుగు, మార్చి 21: జమ్మలమడుగు మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కన్యతీర్థంలో బాలత్రిపురసుందరీదేవి సప్తమ వార్షికోత్సవ వేడుకలను గురువారం ఆలయ కమిటీ ఛైర్మన్, మాజీ ఎమ్మెల్సీ దేవగుడి శివనాథరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకుని శివనాథరెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పునరుద్ధరణ చేసి ఏడేళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా అమ్మవారికి చక్రపూజ, అభిషేకాలు, చండీహోమం తదితర పూజా కార్యక్రమాలు చేశారు. కార్యక్రమంలో అర్చకులు హరిహరనాథశర్మ తదితరులు పాల్గొన్నారు.

దేవతామూర్తుల విగ్రహాల ఊరేగింపు



ముద్దనూరు మార్చి 21: ముద్దనూరులో గురువారం దేవతామూర్తుల విగ్రహాల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఎస్వీగిరి కాలనీలో నూతన రామాలయ ప్రారంభం, దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా సీతారామలక్ష్మణ విగ్రహాలను ఊరేగించారు. శుక్రవారం ప్రత్యేక పూజలు, శనివారం విగ్రహప్రతిష్ఠా కార్యక్రమాలు ఉంటాయని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

వరదరాజులరెడ్డిపై కోడ్ ఉల్లంఘన కేసు

ప్రొద్దుటూరు, మార్చి 21: ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనుమతులు లేకుండా గోపవరం పంచాయతీలోని కాల్వకట్ట వద్ద ఎన్నికల సభ, టీడీపీలో చేరిక కార్యక్రమం నిర్వహించినందుకు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరదరాజులరెడ్డి, గాలిపోతుల సురేష్, బలరామ్‌గారి లక్ష్మి రెడ్డిలపై త్రీటౌన్ పోలీసు స్టేషన్‌లో కోడ్ ఉల్లంఘన కేసు నమోదు చేశారు. అనుమతి లేకుండా సభలు ర్యాలీలు సమావేశాలు నిర్వహిస్తే ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసులు నమోదు చేస్తామని ఎంసీసీ నోడల్ అధికారి, మున్సిపల్ కమిషనర్ రఘునాధరెడ్డి తెలిపారు. ఎవరైనా 24 గంటల ముందు సభలకు, ర్యాలీలకు, సమావేశాలకు అనుమతి తీసుకోవాలని తెలిపారు. సువిధ యాప్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నేడు స్కాలర్‌షిప్‌ల పంపిణీ

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 21: కేసీపుల్లయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాల్లోని 500 మంది పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేయనున్నట్లు కేసీ పుల్లయ్య ఫౌండేషన్ అధ్యక్షురాలు క్రిష్ణమ్మ, కార్యదర్శి అనిల్‌కుమార్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. 22వ తేదీ ఉదయం 10 గంటలకు కొర్రపాడు రోడ్డులోని కేసీ పుల్లయ్య స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేస్తామని, వివిధ రంగాల్లో సేవ చేసినవారికి పద్మశ్రీ వేలు ఆనందాచారికి కళారత్న అవార్డు, పద్మశ్రీ బసంతిదేవికి హరిరత్న అవార్డు, డాక్టర్ కృతిభర్తీకి సేవా రత్న అవార్డు, డాక్టర్ శేషం ఆంజనేయులు విద్యారత్న అవార్డులను ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా రిటైర్డు ఐఏఎస్ అధికారి అశోక్‌కుమార్, డాక్టర్ సంతోష్‌కుమార్, డాక్టర్ చంద్రశేఖర్, శోబిత్ మాధుర్, టంగుటూరి మారుతీప్రసాద్‌లు ముఖ్య అతిధులుగా హాజరవుతారని తెలిపారు.

వైసీపీ నుంచి కొనసాగుతున్న వలసల పర్వం

● 9వ వార్డు వైసీపీ ఇన్‌చార్జ్ రఫీక్ టీడీపీలో చేరిక


టీడీపీ కండువా కప్పి రఫీక్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు, మార్చి 21: పొద్దుటూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే టికెట్టు వరదరాజులరెడ్డికి ప్రకటించడంతో వైసీపీ నుంచి వలసల పర్వం మొదలైంది. గురువారం స్థానిక 9వ వార్డు వైసీపీ ఇన్‌చార్జ్ రఫీక్‌తో పాటు పలు కుటుంబాలు మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. ఈసందర్భంగా వరద రాజులరెడ్డి మాట్లాడుతూ వైసీపీ మునిగిపోయే నావ అన్నారు. ప్రజా కంతక పాలన పూర్తిగా అంతం కాలేదని.. రాబోవు ఎన్నికల్లో వైసీపీని ఓడించి రాక్షక పాలనకు చరమగీతం పాడాలన్నారు. రఫీక్ మాట్లాడుతూ వైసీపీ కోసం ఎంతో పనిచేశామని.. అయినా అక్కడ తగిన గుర్తింపు గౌరవం లేదన్నారు. కింది స్థాయి నాయకులను, కార్యకర్తలను ఎమ్మెల్యే పట్టించుకోరని.. అందువల్లే టీడీపీలో చేరానని ప్రకటించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాఘవరెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, రాజుపాలెం మాజీ జడ్పీటీసీ తోట మహేశ్వర రెడ్డి రామచంద్రారెడ్డి మాజీ కౌన్సిలర్ టప్పా బాషా, జనసేన నాయకులు సుంకర మురళీ తదితరులు పాల్గొన్నారు.

పిచ్చి మొక్కలు తొలగింపు

బద్వేలు, మార్చి 21: బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని మడకలవారిపల్లెలో గురువారం ఎస్‌బీవీఆర్ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల ఆధ్వర్యంలో పిచ్చి మొక్కలను తొలగించారు. అనంతరం రోడ్డు ప్రమాదాల నివారణ గురించి గ్రామస్థులకు తెలియజేశారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మహేష్, కళాశాల ప్రిన్సిపల్ వెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో భూపేశ్‌రెడ్డి

మైలవరం, మార్చి 21: రంజాన్ మాసంలో ఇఫ్తార్ విందు ఎంతో పవిత్రమైనదని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జ్ భూపేశ్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని దొమ్మర నంద్యాల గ్రామంలో వైఎం బాషా, హుస్సేన్‌పీర్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు హాజరయ్యారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాటుసారా స్వాధీనం - వ్యక్తి అరెస్టు

అట్లూరు, మార్చి 21: మండలంలోని వేమలూరు క్రాస్ రోడ్డు వద్ద 15 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఏఎస్ఐ కేసీ రాజు తెలిపారు. గురువారం సిబ్బందితో వాహనాల తనిఖీ చేస్తుండగా సీకేదిన్నె మండలం జమాల్‌పల్లెకు చెందిన వెంకటయ్య అక్రమంగా సారా తీసుకెళుతుండగా పట్టుకున్నట్లు తెలిపారు. పోలీసు సిబ్బంది వెంకటయ్య, భాస్కర్ ఉన్నారు.

యాలి వాహనంపై శ్రీనివాసుడు

బద్వేలు రూరల్, మార్చి 21: మండల పరిధిలోని లక్ష్మిపాలెం గ్రామంలో వెలసిన ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి యాలి వాహనంపై శ్రీనివాసుడు గ్రామ పురవీధుల్లో ఊరేగాడు. భక్తులు కాయ కర్పూరం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించే కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి

కడప (ఎడ్యుకేషన్), మార్చి 21 : కడప కార్పోరేషన్ పరిధిలో నీటిని పొదుపుగా వాడాలని డీఈ కరీముల్లా తెలిపారు. గత మూడు సంవత్సరాలుగా రాష్ట్రంలో తగినంత వర్షపాతం నమోదు కానందున, ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో నీటి మట్టం అడుగంటిందని, ప్రజలకు తాగునీటి సరఫరాలో అంతరాయం కలిగిందని తెలిపారు. పెన్నా, బుగ్గవంకలో బోర్లలో కూడా నీరు అడుగంటిందన్నారు.

20 కుటుంబాలు టీడీపీలో చేరిక


పుట్టా సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

మైదుకూరు రూరల్, మార్చి 21: మైదుకూరు టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్ సమక్షంలో లెక్కలవారిపల్లె సర్పంచ్ జయభరత్‌రెడ్డి ఆధ్వర్యంలో 20 కుటుంబాల వారు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. ప్రొద్దుటూరులోని పార్టీ కార్యాలయంలో గురువారం లెక్కలవారిపల్లె పంచాయతీ గంజికుంటకు చెందిన నరసింహులు, మహేష్, నాగేష్, వెంకటరమణ, రాముతో పాటు పలువురు పార్టీలో చేరారు. వీరికి పుట్టా తెలుగుదేశం పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ పుట్టా సుధాకర్‌యాదవ్‌ను ఈ ఎన్నికల్లో గెలిపించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో గంజికుంట స్వామి, మధు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



వల్లూరు, మార్చి 21 : మండల పరిధిలోని పాపాఘ్నినది తీరంలో మాచిరెడ్డిపల్లె గ్రామంలో పుత్తా నరసింహారెడ్డి కుటుంబీకులచే ప్రతిష్ఠంచబడిన శ్రీలక్ష్మి నరసింహస్వామి 28వ బ్రహ్మోత్సవాల్లో గురువారం అంకురార్పణతో వైభవంగా ప్రారంభమయ్యాయి. అనంతరం విశ్వక్సేన ఆరాధన నిర్వహించి మహాసంకల్పం పటించారు. ఆలయ శుద్ధి కోసం వాస్తు పూజ చేశారు. అనంతరం యాగశాల ప్రవేశించి బ్రహ్మోత్సవాలు ప్రారంభించారు.

అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ప్రతి సంవత్సరంలాగే ఈ ఏడాది కూడా లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు అంకురార్పణతో పుత్తా నరసింహారెడ్డి, ఆయన సతీమణి సరళమ్మ కుమారులు కృష్ణచైతన్య దంపతుల ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. పుట్టమన్ను తీసుకువచ్చి నవధాన్యాలను శుద్ధి చేసి అంకురార్పణ చేశారు. అనంతరం అఖండ దీపారాధన, మంటపపూజ నిర్వహించారు. ధ్వజపీటకు పూజ చేసి ధ్వజారోహణం చేశారు. అంకురార్పణ అనంతరం అగ్నిప్రతిష్ఠ చేశారు. వివిధ పూజల అనంతరం మూలవిరాట్ లక్ష్మీనరసింహునికి మహామంగళహారతి అందించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

బస్‌షెల్టర్లపై వైసీపీ నేతల పేర్లు తొలగించరా..?



గొరిగెనూరు బస్‌షెల్టర్‌పై దర్శనమిస్తున్న వైసీపీ ఎంపీ అవినాష్‌రెడ్డి పేరు

జమ్మలమడుగు, మార్చి 21: ఎన్నికల కోడ్ వచ్చి నాలుగు రోజులు కావస్తున్నా జమ్మలమడుగు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో బస్‌షెల్టర్లపై వైసీపీ నేతల పేర్లు దర్శనమిస్తున్నాయి. మండలంలోని గొరిగెనూరు గ్రామంలో ఏర్పాటు చేసిన బస్‌షెల్టర్లపై ఎంపీవైఎస్ అవినాష్‌రెడ్డి పేరు తొలగించ లేదు. అలాగే జమ్మలమడుగు-ప్రొద్దుటూరు రోడ్డులో పలు చోట్ల బస్‌షెల్టర్లపై కొందరు నాయకుల పేర్లు కనిపించకుండా స్టిక్కర్లు సైతం అతికించలేదు. ధర్మాపురం గ్రామం ప్రధాన రోడ్డు పక్కన ఉన్న బస్‌షెల్టర్‌పై దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, బీజేపీ నాయకులు ఆదినారాయణరెడ్డి పేర్లు దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి వాటిని తొలగించాల్సి ఉంది.

పోలింగ్ కేంద్రాల పరిశీలన


బి.మఠంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్వో చంద్రమోహన్

బ్రహ్మంగారిమఠం, మార్చి 21: మండలంలోని డి.నేలటూరు, గొడ్లవీడు, చౌదరివారిపల్లె, సోమిరెడ్డిపల్లె, కందిమల్లయ్యపల్లె గ్రామాల్లో ఉన్న 24 పోలింగ్ కేంద్రాలను మైదుకూరు నియోజకవర్గ రిటర్నింగ్ ఎన్నికల అధికారి ఎ.చంద్రమోహన్ పరిశీలించారు. అలాగే పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాలను పరిశీలించారు. అక్కడున్న బీఎల్‌వోలను ఓటర్ల జాబితాపై ఏవైనా అభ్యంతరాలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. బి.మఠం తహసీల్దారు శ్రీనివాసులు, డిప్యూటీ తహసీల్దారు జాన్సన్, బీఎల్వోలు ఖాసీం, విజయకుమారి, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఆప్కో వస్త్రాలపై 30 నుంచి 50 శాతం రిబేటు

కడప (మారుతీనగర్), మార్చి 21: రానున్న ఉగాది, రంజాన్, శ్రీరామనవమి పర్వదినాల సందర్భంగా జిల్లాలోని అన్ని చేనేత వస్త్రాల కొనుగోలుపై 30 నుంచి 50 శాతం రిబేటు సౌకర్యం కలదని ఆప్కో కడప మండల వాణిజ్య కార్యాలయ అధికారి ఆర్. రమేష్‌కుమార్ తెలిపారు. ఏపీ రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ విజయవాడ కేంద్ర కార్యాలయ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు అన్ని చేనేత వస్త్రాలపై తగ్గింపు ఇస్తున్నట్లు తెలిపారు. కాగా క్లియరెన్స్ సేల్స్ కౌంటర్‌లో (కడప హెడ్ పోస్టాఫీస్ పక్కన) గల ఆప్కో వస్త్రాలయంలో అన్ని రకాల చేనేత వస్త్రాలపై 1 ప్లస్ 1, 1 ప్లస్ 2 విక్రయాలకు అనుమతి ఉందన్నారు.

విద్యుత్తు తీగలా... యమపాశాలా..!

వేలాడుతున్న తీగలతో భయం... భయం

ఖాజీపేట, మార్చి 21: మండల పరిధిలోని మూలవారిపల్లె, ఖాజీపేట తదితర ప్రాంతాల్లో విద్యుత్తు స్తంభాలు ఒరిగి తీగలు యమపాశాల్లా వేలాడుతున్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానిక ప్రజలు భయాందోళనకు గురవతున్నారు. మరికొన్ని స్తంభాలకు పూలహారంలా తీగెలు అల్లుకు పోయాయి. దీంతో తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. విద్యుత్ బిల్లులు చెల్లించక పోతే వెంటనే కనెక్షన్లు కట్ మాత్రం కట్ చేస్తారని... ఈసమస్యలు పట్టవా అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ఒరిగి పోయిన విద్యుత్ స్తంభాలను, తీగలను సరిచేసి ప్రమాదాలను నివారించడంతో పాటు నాణ్యమైన విద్యుత్తును అందించాలని రైతులు కోరుతున్నారు.

వారంలో రెండు రోజులు బ్రేక్‌డౌన్

అధికారుల నిర్లక్ష్యానికి వారానికి కనీసం రెండు రోజులైనా బ్రేక్‌డౌన్ వస్తుంది. రైతులందరూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని.. నాణ్యమైన విద్యుత్తు వదిలేలా దండల్లా ఉన్న తీగలను సరిచేయాలి.

- రామచంద్రారెడ్డి, రావులపల్లె


మనిషి చేతులకు అందే ఎత్తులో ఉన్న విద్యుత్తు వైర్లు


విద్యుత్ స్తంభానికి పూర్తిగా అల్లుకున్న తీగలు